ఆదివారం

ప్రజాశక్తి

జూలై 6, 2003



కెరీర్...కెరీర్.....

హ్యాపీబర్త్‌డే

(6-7-2003 నుండి
12-7-2003 వరకు)



టి.సమర్(శ్రీకాంత్)
4 సం॥,6. 7. 1999
సావిత్రి-సాగర్
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

బి.లోకేష్‌రెడ్డి
1 సం॥, జులై- 2002
జ్యోతి-సుధాకర్‌రెడ్డి
శివనేనిగూడెం-నల్లగొండ

సంధ్య
3 సం॥, జులై- 2000
విజయలక్ష్మి-సురేష్
అశోక్‌నగర్-హైదరాబాద్



కె.భావన
1 సం॥, 6. 7. 2002
జయలక్ష్మి-చంద్రశేఖర్
పెన్నంచర్ల-మహబూబ్‌నగర్

కె.బేష్మితి
జయంతి-అశోక్‌కుమార్
పూనూరు-ప్రకాశం

మహిన్
4సం॥, జులై-1999
షమీమ్-ఖాజా
అమరచింత-మహబూబ్‌నగర్

పి.లక్ష్మీప్రసన్న
జూన్-6
లావణ్య-రమేష్
తాటికొండ-వరంగల్

కె. అర్చన
1 సం॥, జులై-2002
రమాదేవి-శ్రీనివాస్
తానాజీనగర్-హైదరాబాద్

ఎస్. తేజస్వి
9సం॥, 11. 7. 1995
శారద-బాబూరావు
చిక్కడపల్లి-హైదరాబాద్

స్నేహ
1 సం॥, జూన్-2002
జోత్స్న-రవిందర్
అమరచింత-మహబూబ్‌నగర్

మనలో మాట

ఇంటిపేరు కస్తూరి

ఎక్కడో అస్సాంలో ఉండేవాడికి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య ప్రదాయిని, అస్సామీలకే కాదు దేశంలో చాలా మందికి హైదరాబాద్‌లో అన్ని జబ్బులు నయమవుతాయని ప్రగాఢ విశ్వాసం. అందులో కొంత నిజం లేకపోలేదు. హస్తవాసి గల డాక్టర్లకు భాగ్యనగరంలో కొదవలేదు. పైగా ఇక్కడ మల్టిపుల్ ఛాయిస్ ఉంటుంది. చేపమందు దగ్గర నుండి అన్ని రకాల వైద్యాలు లభిస్తాయి. డబ్బులు దండిగా ఉంటే దర్జాగా నక్షత్ర ఆస్పత్రుల్లో చేరొచ్చు. లేదంటే అమాంబాపతు నాటు వైద్యుల్ని ఆశ్రయించవచ్చు. కాలం కలిసొస్తే రోగి అన్ని పార్టులతో తిరిగి రావచ్చు. లేదంటే గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవచ్చు. మిగతా మెట్రోలతో బేరీజు వేస్తే ఇక్కడి చుక్కల దవాఖానాల్లో చికిత్స చీపట, కావచ్చు కూడా. కాని గ్రహస్థితి బాగాలేక మామూలు మనిషి ఎవరైనా అలాంటి దవాఖానాలో చేరితే ఆ బిల్లులకు పగలే చుక్కలు కనిపిస్తాయి. వ్యాజ్యాల్లో ఓడిన వాడు కోర్టులో ఏడుస్తాడట. గెల్చినవాడు ఇంటికొచ్చి ఖర్చు తలచుకొని ఏడుస్తాడట. ఇంచుమించు రోగుల పరిస్థితి అంతే. స్టార్ ఆస్పత్రుల్లో చేరిన వాడు అటు నుండి అటే టపా కట్టేస్తే బంధువులు ఏడుస్తారు. రోగం నయమయి ఇంటికొస్తే అప్పుల పాలై, ఆస్తులు పోగొట్టుకున్న రోగికి జీవితాంతం ఇక ఏడుపే. నేడు సర్వం వ్యాపార మయం. ఆస్పత్రులూ వ్యాపార కేంద్రాలే. అందుకని అనేక రాష్ట్రాలు 'ఆరోగ్య టూరిజం' అనే కొత్త పథకం కనిపెట్టాయి. చికిత్సకోసం రోగులను ఆకర్షించడమన్నమాట. మన సర్కారు వారు ఈ విషయంలో ఒక అడుగు ముందుకేశారు. ప్రయివేటా, ప్రభుత్వమా అన్న విచక్షణ మనకే గానీ, బయటి వారికి ఎందుకు అని పరమ సూత్రం కనిపెట్టారు. నక్షత్ర ఆస్పత్రులకు రోగుల వేట కోట కోసం వైద్య ఆరోగ్య శాఖను పురమాయించారు. ఆ శాఖ అధిపతికి 'ఆరోగ్య టూరిజం' సమన్వయ బాధ్యత అప్పగించారు. ప్రయివేట్ సేవలో ప్రభుత్వాధికారి. సొమ్మొకడిది సోకొకడిది అన్నమాట. ప్రభుత్వ సొమ్ముతో ప్రయివేట్‌కు లాభాలు. మరి బెస్ట్ సిఇఓ అవార్డులు ఊరికే వస్తాయా?

సరే అదలా ఉంచుదాం. ఆరోగ్య ప్రదాయినికి ఇప్పుడు ఏదో గత్తర తగిలినట్లుంది. రాష్ట్రమంతటా చావులే. హైదరాబాద్‌లో డెంగ్యూ, నల్గొండలో కలరా, కర్నూలులో వింత జ్వరాలు, కరీంనగర్‌లో మెదడువాపు, ఖమ్మంలో దోమలదాడి, గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాలు. ఇలా జిల్లాకో తీరున మరణాలు. వేసవిలో ఎండవేడిమికి పన్నెండువందల మందికి పైగా ఎండుటాకుల్లా రాలిపోయారు. వేసవి ముగిసిందో లేదో గత్తర పట్టుకుంది. అదేమి విచిత్రమో దూరదూర ప్రాంతాలపై దుర్భిణి వేసి రోగులను పట్టుకొచ్చే ఆరోగ్య టూరిజానికి ఈ గత్తర కన్పించదు. బడాబడా కార్పొరేట్ ఆస్పత్రులు కాలుకదల్చలేదు. గత్తర సోకిన ప్రాంతాల్లోకి వెళ్ళలేదు. అయినా వారిని అని ఏం లాభం. ఆరోగ్య శాఖ మంత్రికే ఆ ప్రాంతాలకు వెళ్ళడానికి చాలా కాలానికి గానీ తీరిక చిక్కలేదు పాపం." చుక్కల ఆస్పత్రుల్లో చిన్న చిన్న ప్రారంభోత్సవాలకయినా సరే మన మంత్రుల సదా సిద్ధం. సర్కార్ ఆస్పత్రులకు వెళ్ళాలన్నా, దరిద్రుల నివాసాలకు వెళ్ళాలన్నా అమాత్యులకు చికాకు. కావాలంటే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెడ్తారు. అక్కడి నుండే పేదలకు భరోసా ఇస్తారు. అదే మహా ప్రసాదం. ముక్కుపచ్చలారని పిల్లలను పోగొట్టుకుంటున్న తల్లిదండ్రులకు ఎంతటి సాంత్వన. ఏమైనా ఆరోగ్య ప్రదాయిని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్య టూరిజం వర్ధిల్లాలి. ఇంటి పేరు కస్తూరి వారయితే ఇంట్లో గబ్బిలాల కంపున్నా ప్రశ్నించడానికి వీలులేదు.

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
కవర్‌స్టోరీ	. . . 3
ఆరోగ్యం	. . . 6
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
టూరిస్ట్‌గైడ్	. . . 16
క్రీడారంగం	. . . 17
కళాసాహితి	. . . 21
పలుకుబడి	24

వగైరా . . . .

ఇంకా...

హింసకు దూరంగా ఉంచాలి

బాలవికాసం . . . 10



ఇదొక కహానీ!

'ఇంతి' సంగతులు . . . 15

ప్రవాహం

కథ . . . 18, 19

ఫ్యాషన్ 'షో'కులపై మక్కువెందుకు?

ప్రొఫైల్ . . . 22, 23


కోటి వరాలు
రైతు,మహిళా
జన్మభూమి


WB
మా వాళ్లకూడా
తమరి విశ్వరూపం
చూపించి.. పుణ్యం
కట్టుకోండి సామి !!
ఎమ్మెల్యేలకు
భగవద్గీత
పంపిణీ


"లాఠీ" మీద
ఒట్టు
అంతా
ఒరిజినలే
సీడ్స్
బోగస్
విత్తనాలు

✻ డా॥ కాకర్లమూడి విజయ్





కెరీర్.. కెరీర్...

కెరీర్. ఈనాడు ఏ నోట విన్నా ఇదేమాట. ఎటు చూసినా కెరీర్ గురించి చర్చలే. కెరీర్ గురించి ప్రణాళికలే. అసలు కెరీర్ అంటే ఏమిటి? ఏదో, మనసుకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని, అందులో కొనసాగడమే కెరీరా? లేదా, ఇతరుల ప్రోద్బలం, ప్రోత్సాహం, కొండకచో బలవంతంతో ఒక రంగంలో అడుగిడటమా? లేదా, చదివిన చదువుతో సంబంధం లేకుండా ఏదో ఒక వృత్తిలో దిగి స్థిరపడటమే కెరీరా? అసలు చదువు/విద్య అంటే కెరీరా లేక డబ్బు సంపాదించే ప్రక్రియనే కెరీర్ అంటారా?

ఈనాడు సమాజంలో కెరీర్ అంటే కేవలం ధనార్జన చేసే అవకాశం వున్న 'ఉద్యోగమే' అనే అభిప్రాయం బాగా బలపడిపోయింది. బాగా చదువుకున్న వారిలో కూడా ఇదే అభిప్రాయం పాతుకుపోయి ఉండటం విశేషం. 'ఫలానా రంగంలో కెరీర్ నిర్మించుకోవడం అంటే ఆ రంగంలో స్థిరపడటం. స్థిరపడటం అంటే ఉద్యోగం సంపాదించడం' అంటాడు ఎం.బి.ఎ. ఫైనలియర్ చదువుతున్న సందీప్. చాలా మంది విద్యార్థులలాగే ఇంటర్‌లో ఇంజనీరింగ్ విద్యకి అవసరమయ్యే చదువే చదివినా, తానెంచుకున్న కెరీర్‌లో అడుగు పెట్టడానికి అవసరమయ్యే ప్రవేశ పరీక్షలో సఫలం కాలేకపోయిన సందీప్ తన 'కెరీర్'ను మార్కెటింగ్ రంగంలో నిర్ణయించుకున్నాడు. సందీప్‌తో పాటు చదువుకుంటున్న అన్వర్ ఆలీ మాత్రం ఇంకా తన కెరీర్‌పై సరైన నమ్మకం లేదంటున్నాడు. అతను ఎం.బి.ఎ.తో పాటు సాయంత్రం కంప్యూటర్లు నేర్చుకుంటున్నాడు. ఒకవేళ కెరీర్ మార్కెటింగ్‌లో కాకపోతే కంప్యూటర్ రంగంలో చూసుకోవచ్చనే ధీమాతో ఉన్నాడు.

యూనివర్సిటీలో జంతుశాస్త్రంలో పిహెచ్‌డికై పరిశోధన చేస్తున్న విజయలక్ష్మి అసలు తన పరిశోధనా రంగమే తన ప్రమేయం లేకుండా జరిగిందని అంటోంది. 'ఎం. సెట్‌లో సీటురాక బి.ఎస్సీ, ఆ తర్వాత ఎం.ఎస్సీ. చేయవలసి వచ్చింది. ఎం.ఎస్సీ తర్వాత సరైన ఉద్యోగం లేక ఒక సంవత్సరం ఖాళీగా కూడా ఉన్నాను. ఇక ఏదోఒకటి చేద్దామని రీసెర్చ్‌లో జాయిన్ అయ్యాను. అయితే ఇదే రంగంలో నా కెరీర్ స్థిరపరచుకోవాలని లేదు. లెక్చరర్ పోస్టుల కోసం ప్రయత్నిస్తున్నాను. వస్తే అటు వెళ్ళిపోతాను" అంది ఆమె.

విశ్వవిద్యాలయాలలో దాదాపు డెబ్బై ఎనభై శాతం అటూఇటూగా విజయలక్ష్మి భావననే వ్యక్తీకరిస్తున్నారు. యూనివర్సిటీ స్థాయిలో, అత్యున్నత డిగ్రీలు పొంది కూడా కెరీర్ అంటే సరైన అవగాహన లేకపోవడం ఆశ్చర్యకరమే అయినా వాస్తవం.

'ఈ రోజుల్లో మన అభిరుచుల ప్రకారం జీవించడానికి అవకాశాలు లేవు. పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడటానికే విపరీతంగా కష్టపడవలసి వస్తుంది. ఇక మనకిష్టమైన కెరీర్ నిర్మించుకోవాలంటే కానిపనే' అంటున్నాడు విద్యాసాగర్. ఈయన ఒక విద్యార్థి సంఘ నాయకుడు. రాజకీయాలే మీ కెరీర్‌గా మార్చుకోవచ్చుగా అని అడిగితే 'రాజకీయం అస్థిరం. అందులో కెరీర్ అనేది లేదు' అని తన అభిప్రాయాన్ని చెప్పాడు.

నిజానికి, ఏదైనా ఒక రంగంలో మనస్ఫూర్తిగా పని చేయడమే కెరీర్ అని నిఘంటు నిర్వచనం. సూత్రప్రాయంగా ఇది నిజమే అయినప్పటికీ డబ్బు సంపాదన లేని ఏ పనీ కెరీర్‌గా చూడటం లేదు ఈనాటి సమాజం.

అయితే 'కేవలం ఉద్యోగమే కాక సమాజ సేవ కూడా కెరీర్‌గా తీసుకున్న వాళ్ళున్నారు' అని జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఈయన నగరంలో ఒక జూనియర్ కాలేజీకి డైరెక్టర్. 'ఉద్యోగం కడుపు నింపుతుంది. కానీ దానితో బాటే మనసు నింపే పని కూడా అవసరమే. అదే కెరీర్ అయితే మరీ

బాగుంటుంది' అంటారాయన.

క్రీడలు, నటన, నాట్యం, సంగీతం, చిత్రలేఖనం, శిల్పం వంటి విభిన్న రంగాలలో తమ ప్రతిభను చూపిస్తూ అవే తమ పూర్తిస్థాయి కెరీర్‌గా ఎంచుకుని కొనసాగిస్తున్న వారు అనేక మంది వున్నారు. 'ఏనాటికైనా భారత జట్టులో క్రికెట్ ఆడటమే నా ధ్యేయం. అందులోనే నా కెరీర్' అన్నాడు డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ నాయక్. 'నా కెరీర్ నిర్మించుకోవడానికి వీలుగా ఉంటుందనే డిగ్రీ చేస్తున్నాను తప్ప అవకాశముంటే పూర్తి సమయంలో క్రికెట్‌కే వెచ్చిస్తాను' అంటాడు.

'వృత్తిలోనే కాక ప్రవృత్తిలో కూడా కెరీర్ నిర్మించుకోవడం అవసరం. అలా చేయడం వల్ల ఇటు స్వీయ అభివృద్ధి, అటు సమాజాభివృద్ధీ సాధ్యపడుతుంది. ఈనాటి సమాజంలో ఇటువంటి కెరీర్ అవసరం' అంటాడు జి.రవిప్రసాద్. ఎం.ఎ., ఎల్.ఎల్.బి. చేసిన ఈయన తన న్యాయవాద వృత్తిలో కాక స్వతంత్రంగా ఒక విద్యా సంస్థను నిర్వహిస్తున్నాడు. జీవితంలో మలి దశలో అయినా సమాజ సేవ చేయాలనీ, ఆ దిశలోనే తన కెరీర్ నిర్మాణం జరుగుతుందనీ అంటారాయన. 'ఒక రంగంలో కెరీర్ స్థాపించుకుని కూడా తర్వాతి కాలంలో కెరీర్ మార్చుకున్న వాళ్ళున్నారు. అలా మార్చుకుని విజయవంతమైన వాళ్ళూ ఉన్నారు. అందుకు మంచి ఉదాహరణ ఎన్.టి.రామారావే. ప్రభుత్వ ఉద్యోగంలో కెరీర్ అనుకుని, నటనలో కెరీర్ నిర్మించుకుని, ఆ తర్వాత రాజకీయమే కెరీర్‌గా మలచుకున్న ఘనత ఆయనదే' అని వివరించాడు రవి ప్రసాద్. కెరీర్ విషయంలో ఎన్.టి.ఆర్. తన ఆదర్శమని అంటారాయన.

ప్రణాళికా బద్ధంగా తన జీవన గమనాన్ని నిర్ణయించుకోవడం కెరీర్. అంతేగాని సామాన్య బాధ్యత కూడా కెరీర్‌గా ఎంచుకోవడం భావ్యం కాదు. ఉదాహరణకి ఏ స్త్రీ కూడా విద్యావంతురాలైనా, కాకున్నా హౌస్‌వైఫ్ ఇంటి ఇల్లాలుగా ఉండటం కెరీర్ అని భావించుకోదు. అది తన బాధ్యత. ఆ బాధ్యతకు అనుబంధంగా ఏదైనా ఉపయోకరమైన పని - తనకి, తన కుటుంబానికీ, తన చుట్టూ సమాజానికి - చేపడితే అది కెరీర్ కావచ్చు. అలా తమ అభిరుచులను కెరీర్‌గా మలచుకొని విజయవంతమైన వాళ్ళు అనేకం.



విద్యకీ కెరీర్‌కీ సంబంధం ఉందా లేదా? 'సంబంధం ఉండనవసరంలేదు. కానీ, మంచి కెరీర్‌ను ఎంచుకోవడానికి విద్యే సాధనంగా మారవచ్చు' అంటారు జి.రవి ప్రసాద్. కానీ విద్య లేకపోయినా అనేక రంగాలలో విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకున్న వాళ్ళున్నారు. ఎన్నో వ్యాపారాలు, ఎన్నో సమాజాభివృద్ధి కార్యకలాపాలు సాగిస్తున్న వారిలో చాలా మంది కనీస విద్యకూడా లేనివారే. అయితే విద్యవల్ల కెరీర్‌కి ఎలా ఉపయోగం? వాస్తవానికి కొన్ని వృత్తి విద్యలు తప్ప నిఖార్సయిన కెరీర్ నిర్మించే విద్య మన విద్యావ్యవస్థలో లేదనే చెప్పవచ్చు. ఏది చదివితే ఎటువంటి ఉద్యోగం వస్తుందో అనే ధ్యాసే తప్పితే మన అభిరుచులూ, అభిలాషలూ ఆచరణలో పెట్టదగ్గ అవకాశం చాలా వరకూ లేదనే చెప్పవచ్చు. ఈ స్థితి పదవ తరగతి నుండే ఉత్పన్నమవుతుంది. లెక్కలొస్తే ఇంజనీరు, రాకపోతే డాక్టరు? సైన్సంటే భయమైతే కామర్స్/ఆర్ట్స్ అంటూ ఉన్న నాలుగైదు దారులలో ఇరుక్కుని, వాటికే పరిమితమైపోవడం నేటి విద్య ప్రత్యేకత. మాటవరసకి స్వతహాగా తెలివితేటలుండీ, చిత్రకళ అంటే అభిరుచి ఉండీ, ఆ దిశలో కెరీర్ పెంపొందించుకుందామనుకుంటే మన కుటుంబాలలో కుదరదు. బాగా చదవగలుగుతున్నాము కాబట్టి సాంప్రదాయక పద్ధతిలో ఇంటర్, ఎంసెట్, డిగ్రీ... ఇలా సాగవలసిందే. సంప్రదాయానికి భిన్నంగా సాగాలంటే చదువులో చతికిలబడిన వాళ్ళకే సాధ్యం. ఈ పరిస్థితి చాలా దురదృష్టకరమైనది. నగరంలోని జె.ఎన్.టి.యు.లో శిల్పకళ అభ్యసిస్తున్న రమేష్ పరిస్థితి అదే. 'నేనే గనక పదవ తరగతిలో మంచి మార్కులతో పాసై ఉంటే అందరిలాగే ఇంటరు చదివి ఉండేవాడిని. అలా జరగలేదు గనక నాకున్న కళలో ప్రావీణ్యానికి అవకాశం వచ్చింది. అందుకు సంతోషించాలో, అందరిలా 'మంచి' విద్య చదవలేనందుకు బాధపడాలో తెలీడం లేదు' అంటాడు. కొంతమందికి అనుకున్నవి అనుకున్నట్టు జరుగుతాయి. ఇష్టమున్న రంగమే ఉపాధి కూడా ఇస్తుంటే అంతకు మించిన కెరీర్‌లేదు. కానీ కొన్నిసార్లు ఇష్టం లేకపోయినా కొన్ని కెరీర్‌లు ఎంచుకోవలసి వస్తుంది. అటువంటి సమయాలలో చేస్తున్న పనిపై ఇష్టాన్ని పెంచుకోవడం మంచిది.



కెరీర్‌ని సూక్ష్మంగా, ప్రత్యేకంగా కాక స్థూలంగా పరిగణించడం అవసరం. ఉదాహరణకి దేశ సేవను కెరీర్ అనుకుంటే ఆ కెరీర్‌ను అందుకోవడానికి అనేక మార్గాలున్నాయి. అలాగే సమాజ సేవ. ఒక టీచర్‌గా, ఒక రాజకీయ వేత్తగా, ఒక సామాన్య పౌరుడిగా... ఎన్నో రకాలుగా ఆ గమ్యంపై దృష్టి సారించవచ్చు.

ఏ రంగంలో అయినా కెరీర్ నిర్మించుకోవాలనుకుంటే ఆ రంగంపై సరైన అవగాహన ఉండటం అవసరం. వీలైతే అభిరుచీ అవసరమే. ఈ రెండూ ఉంటే విజయం, తద్వారా కెరీర్‌లో తృప్తి సాధ్యమవుతుంది. ప్రస్తుత పరిస్థితులలో కేవలం ఉద్యోగం సంపాదించడం, ఆ ఉద్యోగమే కెరీర్ అనుకోవడం సామాన్యమైపోయింది. ఈ మొత్తం ప్రక్రియలో చదువుకీ, ఇష్టానికీ, ఆశలకీ, ఆశయాలకీ స్థానం ఉండొచ్చు. ఉండకపోవచ్చు. చాలా సందర్భాలలో వీటికి స్థానం ఉండకపోవడమే జరుగుతుంది. అందుకు కారణాలు అనేకం ఉండవచ్చు.

'పెళ్ళి కాకముందు, రసాయన శాస్త్రంలో

పరిశోధన చేసి, అందులోనే నా కెరీర్ నిర్మించుకుందామనుకున్నాను. కానీ వివాహానంతరం కుటుంబ పరిస్థితులు నా లక్ష్యాన్ని నా నుండి దూరం చేశాయి. ఇప్పుడు ఒక స్కూల్లో పాఠాలు చెబుతున్నాను. కానీ ఇప్పటికీ దీనిని నా కెరీర్‌గా అనుకోలేకపోతున్నాను" అని వాపోతున్నారు శ్రీమతి శోభ.

ఇటువంటి పరిస్థితులు - ప్రత్యేకించి కుటుంబ పరిస్థితులు - కెరీర్ వంటి కీలక అంశాలలో పెను ప్రభావం చూపుతున్నాయి. ఇటువంటి స్థితి ముఖ్యంగా స్త్రీలకే రావడం గమనార్హం. అనేక 'పురుషాధిక్య' రంగాలలో సైతం స్త్రీలు తమ ప్రావీణ్యాన్ని, ప్రాభవాన్నీ చూపుతున్న ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా ఇటువంటి పరిస్థితులు ఉండటం ఒకింత విచారకరమే. కానీ అదే స్త్రీలు తమ పిల్లల భవిష్యత్తు (కెరీర్) ఆలోచించేటప్పుడు కాస్త భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. 'నేను కాల్ సెంటర్లో పని చేస్తున్నాను. నేను చదివిన డిగ్రీకి, నేను చేసే పనికీ ఏ మాత్రం సంబంధం లేదు. ప్రత్యేకించి ఈ పనిలో పనివేళలు కాస్త ఇబ్బందిగా ఉన్నా ప్రస్తుతానికి ఇదే నా కెరీర్. కానీ నా పిల్లల్ని మాత్రం కచ్చితంగా ఈ కెరీర్‌లోకి రానివ్వను' అని చెప్పారు నీలిమారావ్. కంప్యూటర్ రంగంలో రాణిద్దామని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాల్‌సెంటర్‌లో చేరానని నీలిమారావ్ అన్నారు. విద్య, ఉపాధి పరిధి, అవకాశాలు ఇది వరకు ఉన్నంత తక్కువగా ఈనాడు లేవు. అనేక అనూహ్య రంగాలకై విద్యావకాశాలూ, అంతకుమించిన రంగాలలో ఉపాధి అవకాశాలూ వికసిస్తున్నాయి. గత కొంతకాలం క్రితం అంతగా పేరు, ఆదరణ లేని హోటల్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి రంగాలలో ఈనాడు విపరీతమైన క్రేజ్ ఉంది. వీటిలో చేరాలంటే, ఇవి తమ కెరీర్‌గా ఎంచుకోవాలంటే ఇప్పటికీ కొన్ని కుటుంబాలలో వ్యతిరేకత ఉంది. అయినా ఈ 'కొత్త' కెరీర్లలో చేరేవాళ్ళు తగ్గలేదు.

బయోఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ వంటి నూతన రంగాలు ఈ మధ్యనే ఆవిష్కరించబడ్డాయి. వీటినీ తమ కెరీర్‌గా మార్చుకోవాలనుకునే వారు రోజురోజుకీ పెరుగుతున్నారు. ఇవన్నీ విద్య ద్వారా నిర్మితమవుతున్న కెరీర్లు. ఫలానాది చదివితే ఫలానా దాంట్లో సెటిలవ్వవచ్చు అనుకోవడం పరిపాటి. ఇక్కడ ప్రాధాన్యత 'సెటిల'వ్వడానికే. అంటే కెరీర్‌కి అర్థం జీవితంలో సెటిల్‌మెంట్ అనే భావన చాలా మందిలో ఉంది. అలా కాకుండా కొన్ని వైవిధ్య రంగాలలో కూడా తమ కెరీర్‌ను నిర్మించుకున్న వాళ్ళున్నారు. వీళ్ళకి సెటిల్‌మెంట్ అంటే నిశ్చింత కాదు. ఉదాహరణకి సినిమాల్లో ఫైట్ డూప్‌లు. అత్యంత ప్రమాదకరమైన ఫీట్లు చేస్తూ, అనుదినం ప్రమాదాలలో రిస్క్ చేసే కెరీర్ మామూలు వాళ్ళకి భయంగొలుపుతుంది. పర్వతారోహకులు, యుద్ధ విమాన పైలెట్లు వంటి వాళ్ళు కూడా తమ కెరీర్‌ని-రిస్క్ అని తెలిసీ స్వీకరించడం విశేషం. 'నిజానికి మామూలు సాదాసీదా ఉద్యోగాలు



కెరీర్ కానే కావు' అంటారు శ్రీనివాస్. ఈయన ఒక ప్రముఖ కంప్యూటర్ సంస్థలో ప్రోగ్రామర్‌గా పని చేస్తున్నాడు. 'ఒక బ్యాంకులో క్లర్క్, హోటల్లో రిసెప్షనిస్టు వంటి ఉద్యోగాలు కేవలం ఉద్యోగాలే. వాటితో ఆర్థిక వెసులుబాటు తప్ప మరే విధమైన అభివృద్ధీ ఉండదు. ఆ మాటకొస్తే ఎటువంటి ఉత్సాహమూ, ఉత్తేజమూ ఉండదు. అటువంటి వాటిని 'కెరీర్' అనడం తప్పు' అని చెప్పాడు శ్రీనివాస్.

విదేశాలలో విద్యార్థులు తమ విద్యతో

సంబంధం ఉన్న రంగాలలో కెరీర్ కోసం చూస్తూ, డబ్బుకోసం 'పార్ట్‌టైం జాబ్'లు చేపడతారు. ఇటువంటి 'జాబ్'లను తమ కెరీర్‌గా తీసుకోరు. అవి ఎప్పటికీ తాత్కాలికంగానే ఉండిపోతాయి. మన దేశంలో కూడా ప్రభుత్వోద్యోగాలు చేస్తూ వాటిని కేవలం ఉద్యోగాలుగా మాత్రమే పరిగణిస్తూ, తమ తీరిక సమయాల్లో తమకిష్టమైన ప్రవృత్తిని చేపట్టి అదే కెరీర్‌గా భావించే వాళ్ళు చాలా మంది ఉన్నారు.

అయితే ప్రస్తుత కాలంలో, కేవలం చదివిన చదువుకు సంబంధించిన రంగాలలోనే కెరీర్ కాకుండా అనేక ప్రజాభివృద్ధికి సంబంధించిన రంగాలను కెరీర్‌గా ఎంచుకునేవాళ్ళు అవసరం. ఇప్పటికీ 'చదువుకున్న' వాళ్ళకు రాజకీయాలు కూడదు అనే అభిప్రాయం బలంగా పాతుకుపోయింది. 'అందువల్ల ఆ రంగం అవాంఛనీయ వ్యక్తులతో నిండి కలుషితమైపోయింది' అని చెప్పాడు రమేష్. యువతకు ముఖ్యంగా విద్యావంతులైన యువతకు రాజకీయ చైతన్యం అత్యవసరం. ఆ రంగాన్ని తమ కెరీర్‌గా ఎంచుకోవడం సమాజానికి ఉపయోగకరం' అని చెప్పాడు రమేష్. ఈయన యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు.

''ఏది కెరీర్ అనుకున్నా, అనుకోలేకపోయినా ఇల్లు గడిచే జీతం వస్తున్న తరువాత ఏం చేసినా ఫర్వాలేదు'' అన్నాడు లెండింగ్ లైబ్రరీ నడుపుతున్న అంజయ్య. తన ఇద్దరు పిల్లల్ని డిగ్రీ చదివిస్తున్నాడు. 'ఏదో ఒక ఉద్యోగంలో సెటిలవ్వడమే చాలు. కెరీర్ మాటలు అనవసరం' అంటాడు అంజయ్య.

కాబట్టి కెరీర్ అంటే ఏతావాతా ఉద్యోగమనే అర్థమూ, అభిప్రాయమూ అమరిపోయాయి. తమ అభిప్రాయాలకు విలువ, తమ అభిరుచులకు గౌరవం ఇచ్చుకుంటూ వాటిలోనే కెరీర్ వెదుక్కునే వాళ్ళు తక్కువే, అయినా ఉన్నారు. అలాగే ఉద్యోగాలు చేస్తూ కూడా వాటిని తమ కెరీర్‌గా భావించని వారూ ఉన్నారు. తమకి స్వతహాగా వచ్చిన కళలను నమ్ముకుని వాటిపై ఆధారపడుతూ (సంపాదనకు) అదే కెరీర్‌గా మార్చుకున్న వాళ్ళూ ఉన్నారు. అదే విధంగా సమాజ సేవకు అంకితమైన వారూ ఉన్నారు. ఏదేమైనా, తమ అభివృద్ధికీ, తమతో పాటు తమ చుట్టూ ఉన్న సమాజ అభివృద్ధికీ తోడ్పడే విధంగా కెరీర్‌ను ఎంచుకోవడం, నిర్మించుకోవడం ఎంతైనా అవసరం.



* డా॥ ఎ.శ్రీనివాస్

కాటరాక్ట్ ఆపరేషన్

కంటిలోపల లెన్స్ పవరు కలిగి ఉండి (సుమారు .20.0) కాంతి కిరణాలను రెటీనామీదకు కేంద్రీకరింప జేయటం వలన ఏదైనా వస్తువును చూడగలుగుతాము. కాటరాక్ట్ అంటే కంటిలోని లెన్సు అనే భాగం మసక బారటం. ఈ మసక బారిన లెన్స్ కావలసినంత వెలుతురు రెటీనాకు చేరకుండా అడ్డుకుని దృష్టిని మందగింప జేస్తుంది.



ఫోల్డబుల్ ఇంట్రా ఆక్యులర్ లెన్స్

సాధారణంగా 50 సంవత్సరాలు పైడిన వారిలో శుక్లం ఏర్పడుతుంది. కానీ ఏ వయసు వారిలోనైనా రావచ్చు. గర్భిణీ స్త్రీలలో వ్యాధులు వచ్చినపుడు ఆ ప్రభావం గర్భంలో ఉన్న శిశువు మీదపడి శుక్లము లేక ఇతర కంటి వైకల్యాలు కలగవచ్చు. కేటరాక్టు వంశపారం పర్యంగాను, కొన్ని మందుల వలన లేదా దెబ్బతగిలినపుడు కూడా సంభవించవచ్చు.

శుక్లం తొందరగా ఏర్పడటానికి దారితీసే పరిస్థితులు :

1. షుగర్ వ్యాధి
2. ఉబ్బసం వలన కానీ లేదా మరి ఏ ఇతర వ్యాధులైనా
3. కంటిలోపల రసిచేరటం.
4. కంటికి దెబ్బతగలటం.

కాటరాక్ట్ యొక్క లక్షణాలు :

- చూపు మసకబారటం
- లైట్ల కాంతివలన లేదా సూర్యరశ్మి వలన ఇబ్బందికి గురి కావటం
- రాత్రివేళ దృష్టి మందగించటం
- రెండుగా కనిపించటం
- కంటిపాప తెల్లగా మారటం
- తరచుగా కంటి అద్దాలను మార్చుకోవలసి రావడం.

కాటరాక్ట్ చికిత్స :

శుక్లమునకు శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. శుక్లం ఏదశలో ఉన్నా ఏ వయసు వారికైనా శస్త్రచికిత్స చేయవచ్చు. శుక్లం బాగా ముదిరి పోయినపుడు కంటిలోపల చిట్లి తీవ్రమైన పోటు కలుగుతుంది.



అటువంటి సమయంలో చికిత్స కూడా కష్టతరమవుతుంది.

శుక్లము తీసిన తరువాత ప్రత్యామ్నాయంగా అంతే పవరు లైన్స్



కంటి నిర్మాణం

ఉపయోగించటం వలన చూపు మెరుగవుతుంది. ఐఓఎల్ అమర్చని పక్షంలో బయట సుమారు +10.0 పవరు లెన్స్ ధరించటం వలన చూపు మెరుగవుతుంది. ఇవి బరువుగా మందంగా ఉండటమే కాక చూపు సహజంగా ఉండదు. నడిచేటప్పుడు ఎత్తు పల్లాలు సరిగ్గా తెలియవు.

ఐఓఎల్ శస్త్రచికిత్స

కంటిలోనే కృత్రిమ లెన్స్ అమర్చటం వలన మందపాటి అద్దాల అవసరం ఉండదు. చూపు సహజంగా ఉంటుంది. కాంటాక్ట్ లెన్సెస్ వలే కాకుండా ఇది కంటిలో శాశ్వతంగా ఉండిపోతుంది. సాధారణంగా ఐ.ఓ.ఎల్. కంటికి ఏ విధమైన ఇబ్బంది కలిగించదు. పూర్తిగా సురక్షితమైనది.

ఐఓఎల్స్ బైఫోకల్, ఫోల్డబుల్, యూనిఫోకల్, మల్టీఫోకల్ అని రకరకాలు వున్నాయి. అవసరాన్ని బట్టి వృత్తిని బట్టి వీటిని ఎంచుకోవడం జరుగుతుంది.

కాటరాక్ట్ చికిత్స ప్రత్యామ్నాయాలు !

- ఎక్స్‌ట్రా కేప్సులర్ కాటరాక్ట్ ఎక్స్‌ట్రాక్షన్ (ఇసిసిఇ)
- మైక్రో ఇన్సిషన్ కాటరాక్ట్ శస్త్రచికిత్స





(ఫేకో ఎమల్సిఫికేషన్)

ఎక్స్ట్రా కేప్సులర్ కేటరాక్ట్ ఎక్స్ట్రాక్షన్ (ఐఇసిఇ)

- 10-12 మి.మీ. వరకు కత్తిరించవలసిన అవసరముంటుంది.
- మసగబారిన లెన్స్‌ను ఒకే తునకగా తొలగించటం జరుగుతుంది.
- కత్తిరించిన భాగాన్ని సూక్ష్మమైన దారాలతో కుట్టు వేయవలసి ఉంటుంది.
- ఈ పద్ధతిలో సుమారు 6 వారాలు చాలా జాగ్రత్తగా ఉండాలి.
- కంటికి ఒత్తిడి కలిగించే పనులేమీ చేయరాదు.
- గట్టిగా దగ్గినా, ముక్కినా దారాలు తెగే ప్రమాదం ఉంటుంది.
- ఆపరేషన్ తరువాత కనీసం 6 వారాల పాటు కంటికి ఏ విధమైన దెబ్బకాని, ఒత్తిడి కాని కలుగకుండా చూసుకోవాలి.
- చూపు మామూలు స్థితికి రావడానికి కనీసం 6 వారాలు పడుతుంది.

స్మాల్ ఇన్సిషన్ కాటరాక్ట్ సర్జరీ (ఎస్.ఐ.సి.ఎస్.)

ఈ పద్ధతిలో 1 లేక 2 కుట్లు వేయవలసి ఉంటుంది. చూపు మామూలు స్థితికి రావడానికి 3 లేక 4 రోజులు పడుతుంది. ఆపరేషన్ తరువాత చిన్న చిన్న పనులు చేసుకోవచ్చు.

మైక్రో ఇన్సిషన్ కాటరాక్ట్ శస్త్ర చికిత్స (ఫేకో ఎమల్సిఫికేషన్)

ఈ పద్ధతిలో మసకబారిన లెన్స్‌ను అల్ట్రాసౌండ్ తరంగాలు ఉపయోగించి చిన్నచిన్న భాగాలుగా చేసి, కరిగించి తొలగించటం జరుగుతుంది. కేవలం 3ఎమ్ఎమ్ రంధ్రం ద్వారా శుక్లము ఆపరేషను జరపటానికి వీలుంటుంది.

- కుట్లు వేయనవసరం లేకపోవడంతో గుచ్చుకొనటం, నీరు కారటం, కుట్లు తీయటం వంటివి ఉండవు.
- ఇన్‌ఫెక్ట్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ.
- శస్త్ర క్రియ అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా తక్కువ. సర్జికల్ ఆస్టిగ్మాటిజం తక్కువ.
- ఈ పద్ధతి ద్వారా శుక్లం ముదరనవసరం లేకుండానే చికిత్స చేయవచ్చు.
- చూపు మామూలు స్థితికి త్వరితంగా వస్తుంది.

ఫోల్డబుల్ లెన్సెస్

ఇవి అత్యాధునికమైన కృత్రిమ అద్దాలు, ఫాకో చేసిన 3 మీ.మీ. రంధ్రం ద్వారానే ప్రత్యేకమైన ఇంజెక్టర్ ద్వారా లేదా ప్రత్యేకమైన ఫోర్సెప్స్ ద్వారా కంటిలో ఈ అద్దాన్ని అమర్చటం అనేది వీటి ప్రత్యేకత. ఈ ఫోల్డబుల్ లెన్స్ సహజమైన లెన్స్‌కి దగ్గరగా రూపొందించబడిన ప్రత్యామ్నాయం.

మైక్రో-ఇన్సిషన్ శస్త్రచికిత్స (ఫేకో), ఫోల్డబుల్ ఇంట్రా ఆక్యులర్ లెన్స్

- ఈ పద్ధతి అత్యంత ఆధునికమైనది, సురక్షితమైనది.
- ఈ పద్ధతి ద్వారా లెన్స్ అమర్చటం వలన చూపు మామూలు స్థితికి త్వరితంగా (1 లేక 2 రోజులలో) రావటమే కాకుండా వెంటనే విధులకు హాజరయ్యే అవకాశం ఉంది.
- చూపు సహజంగా, స్పష్టంగా ఉండటమే కాకుండా ఆపరేషన్ అనంతరం పనులు చేసుకొన్నాను కంటిమీద ఒత్తిడి పడదు.



ఎస్.ఐ.సి.ఎస్.

- ఆపరేషన్ అనంతరం విశ్రాంతి తీసుకోవడానికి వీలు పడని వారికి ఈ ఆధునిక శస్త్రచికిత్స ఒక వరం వంటిది.
- ఒకవేళ ఒక కంటికి ఇది వరకే ఇసిసిఇ/ఎస్ఐసిఎస్ ద్వారా కాటరాక్ట్ శస్త్రచికిత్స జరిగి ఉన్నా, మరోకంటికి ఫేకో శస్త్రచికిత్స చేయటం సాధ్యపడుతుంది.



ఫేకో



ఐఇసిఇ

గుర్తుంచుకోవలసిన విషయాలు

- కేవలం శస్త్రచికిత్స మాత్రమే శుక్లం గల కంటికి తిరిగి దృష్టి ప్రసాదించగలదు.
- ఐఓఎల్ అమర్చిన వారిలో చదవటానికి పవరు అద్దాలు వాడవలసి ఉంటుంది.
- ఫేకో సాధ్యపడేందుకు కన్ను మెరుగైన ఆరోగ్యం కలిగి ఉండాలి. శుక్లం ఉన్న కంటిలో ఫేకో సర్జరీ చేయటమా లేదా అన్న విషయంలో తుది నిర్ణయం వైద్యునిది.
- శుక్లం ముదిరినపుడు కంటిలోపలి భాగాలను క్షుణ్ణంగా పరిశీలించటానికి వీలుపడదు. కంటినరం బలహీనంగా ఉన్నా, రక్తప్రసరణ సరిగ్గా లేకపోయినా, రెటీనాలో ఏదైనా తేడా ఉన్నా, బాగా వయసు మళ్ళిన వారిలోను చూపు పూర్తిగా మెరుగవదు. ఆ వ్యాధులకు వేరే పరీక్షలు జరిపి చికిత్స చేయవలసి ఉంటుంది. ◆

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపండి

ఆదివారం అనుబంధంలో పాఠకుల నుంచి ఆరోగ్య సమస్యలపై ప్రశ్నలు ఆహ్వానిస్తున్నాం. మీ సమస్యలకు నిపుణులైన వైద్యులు పరిష్కారాలు సూచిస్తారు. ప్రశ్నలు సూటిగా, సాధ్యమైనంత కుప్లంగా ఉండాలి.

ప్రశ్నలు పంపవలసిన చిరునామా :

సంపాదకులు, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

* అంపశయ్య నవీన్



'భూతం' సినిమాలు

చాలా రోజుల తర్వాత మిత్రుడు రమేష్ కుమార్ నాతో కాస్సేపు మాట్లాడిపోదామని మా ఇంటికొచ్చాడు. రమేష్ కుమార్‌కు చిన్నప్పట్నించీ సినిమాలంటే పిచ్చి ఇష్టం. విడుదలైన ప్రతీ సినిమా చూస్తుంటాడు. యాభయ్యేళ్ళొస్తున్నా అతని సినిమా పిచ్చి ఏ మాత్రం తగ్గలేదు. అతనితో ఏ టాపిక్‌ను గూర్చి మాట్లాడదామన్నా దాన్ని సినిమాల వైపు మళ్ళిస్తాడు. అందుకని అతడొచ్చి కూర్చోగానే వేరే టాపిక్ మాట్లాడటమెందుకని నేను సినిమా టాపిక్‌తోటే మా సంభాషణ ప్రారంభించాను.

"ఏం రమేష్? ఈ మధ్య ఏమేం సినిమాలు చూశావేమిటి?" అన్నాను.

"నిన్న రాత్రే అద్భుతమైన సినిమా చూశాను – ఆ సినిమా చూసినప్పట్నించీ నేనెక్కడా నిలకడగా కూర్చోలేకపోతున్నాను. నిల్చోలేకపోతున్నాను. రాత్రి పడుకుంటే నిద్ర పట్టడం లేదు... ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయమేస్తోంది. తలుపు చప్పుడైతే భయం... డైనింగ్ టేబుల్ మీది నుంచి గ్లాసులు కిందపడ్తే భయం... ఎవరన్నా గట్టిగా అరిస్తే భయం.. మా ఆవిడొచ్చి టీకప్పులు చప్పుడు చేస్తూ 'టీ తెచ్చాను. తాగండి' అని చెప్పినా భయమే... అమ్మో! భలే సినిమాలెండి. సినిమాలంటే అట్లా ఉండాలి" అన్నాడు రమేష్ సోఫామీద అసహనంగా అటూ ఇటూ కదులుతూ.

"కొంపదీసి హారర్ సినిమా చూశావా ఏమిటి?" అన్నాన్నేను.

"దయ్యాల, భూతాల సినిమా గురూ! ఓ ఇరవై అంతస్తుల బిల్డింగ్‌లో పన్నెండో అంతస్తు మీదున్న అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఓ స్త్రీకి దయ్యం పడ్తుంది... మొదలు ఉత్తుత్తి దయ్యమేనేమో అనుకుంటాం. ఆమెకేదో మానసిక రోగమొచ్చింది... అందుకే అలా దయ్యం పట్టినట్లు ఊహించుకుంటోంది అన్నట్టుగా దర్శకుడు చూపిస్తాడేమో అనుకున్నాను... అదేం జరగదు... ఆమెకు నిజంగానే దయ్యం పడ్తుంది.. ఓ భూత వైద్యురాలొచ్చి ఆమెకు పట్టిన దయ్యాన్ని వదలగొడ్తుంది... డైరెక్టర్ కొన్ని సీన్స్ భలే తీశాడు గురూ! గ్రేట్! మరోసారి చూడాలనిపిస్తున్నది" అన్నాడు రమేష్ కుమార్.

"దయ్యాలూ, భూతాలూ ఉన్నాయని చెప్పే సినిమాను కూడా నీలాంటి బాగా చదువుకున్న వాడు బావుందనటం ఈ దేశంలో మూఢవిశ్వాలెంత బలంగా నాటుకు పోయాయో అర్థమవుతున్నది. ఆ డైరెక్టర్‌కు సామాజిక బాధ్యత అనేది ఏ కొంచెమున్నా దయ్యం పట్టడమనేదొక మానసిక జాడ్యం అన్నట్టుగా చూపించాలి.... ఓ మానసిక వైద్యుడొచ్చి ఆమెకు పట్టిన ఆ మానసిక జాడ్యాన్ని పోగొట్టినట్టుగా చూపించాలి. ఈ దేశంలో ఈ ఇరవయ్యొకటవ శతాబ్దంలో కూడా దయ్యాలూ, భూతాలు నిజంగా ఉన్నాయని నమ్మే అజ్ఞానులే ఎక్కువగా ఉన్నారు. ఎన్నో పల్లెటూళ్ళల్లో ఎవరన్నా కొంచెం అసహజంగా ప్రవర్తిస్తే చాలు వాళ్ళకు దయ్యం పట్టిందనుకుంటారు. భూతవైద్యుల దగ్గరకు పరుగెడ్తారు... ఈ భూత వైద్యులు కూడా ప్రజల్లో ఉన్న అజ్ఞానాన్ని డబ్బు చేసుకోవడానికెప్పుడూ రెడీగా ఉంటారు. మానసిక వ్యాధులకు గురైన వాళ్ళకు దయ్యం పట్టిందని వాళ్ళను రకరకాలుగా హింసిస్తారు. పల్లెటూళ్ళల్లో ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే అతనికెవరో చేతబడి చేశారనుకుంటారు. ఊర్లో భూతవైద్యం చేసేవాళ్ళకు మంత్రాలొస్తాయని వాళ్ళే చేతబడిచేసి చంపేశారని నమ్ముతారు. లేకపోతే ఊర్లో ఉన్న రాజకీయాల కారణంగా తమకు కోపమున్న వాళ్ళ మీద మంత్రగాళ్ళుగా ముద్రవేస్తారు.

ఊర్లో మరికొందరు తమకు మంత్రాలొస్తాయని ప్రచారం చేసుకుంటూ ఊర్లో అందర్నీ భయపెట్టించుకోవాలంటారు. మంత్రాలు ప్రయోగించి ఓ వ్యక్తిని చంపెయ్యడం అసాధ్యమని చాలామంది నమ్మలేరు. దాంతో ఊర్లో ఎప్పుడైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు, ముఖ్యంగా పైకి ఆరోగ్యంగా ఉన్నట్టు కనిపించే వాళ్ళు అకస్మాత్తుగా చనిపోతే వాళ్ళు మంత్రగాళ్ళు చేసిన చేతబడి వల్లనే చనిపోయారనుకుంటారు. ఊరివాళ్లందరూ ఒక్కటై మంత్రగాళ్ళని అనుమానమున్న వాళ్ళను వేటాడుతారు. వాళ్ళ ముందు పళ్ళూడబీకితే వాళ్ళ మంత్రాలు పని చెయ్యవన్న మూఢనమ్మకంతో చాలా భయంకరంగా మంత్రగాళ్ళన్న అనుమానమున్న వాళ్ళ పళ్ళు పీకేస్తారు. దాంతో కూడా తృప్తిపడక వాళ్ళను సజీవ దహనం చేస్తుంటారు. ఒకేసారి ఏడెనిమిది మందిని మంత్రగాళ్ళని అనుమానించి ఊరివాళ్ళందరూ.కలిసి సజీవదహనం చేసిన సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. ఇదంతా దయ్యాలూ, భూతాలున్నాయన్న మూఢనమ్మకం మీద అధారపడి జరుగుతున్నాయని మనం మరచిపోకూడదు. యల్లమ్మ, ముత్యాలమ్మ లాంటి క్షుద్రదేవతలుంటారని, వాళ్ళను మనకిష్టం లేని వాళ్ళ మీద ప్రయోగించవచ్చునన్న నమ్మకం కూడా పల్లెటూళ్ళలో బలంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సినిమాల్లాంటి బహుళ ప్రచార సాధనాలేం చెయ్యాలి? దయ్యాలూ, భూతాలు, క్షుద్రశక్తులూ లేవని, అవి కేవలం మూఢనమ్మకాలేనని సినిమాల్లో చూపించాలి. కొన్ని మానసిక రుగ్మతల కారణంగా స్త్రీలు, పురుషులూ విచిత్రంగా అసహజంగా ప్రవర్తిస్తారని చెప్పాలి. అలాంటి వాళ్లను మానసిక వైద్యుల దగ్గరకు తీసుకెళ్ళాలన్న ప్రబోధం సినిమాల్లో ఉండాలి. అంతేగాని దయ్యాలు నిజంగానే ఉంటాయనీ, దయ్యం పట్టిన స్త్రీలను బాగు చెయ్యాలంటే భూత వైద్యుల దగ్గరికే తీసుకుపోవాలని చూపించడం సమాజానికి ద్రోహం చెయ్యడమే అవుతుంది. ఇలాంటి సినిమాలు చూసిన వాళ్ళందరికీ వాళ్ళకిదివరకే ఉన్న దయ్యాల మీద మూఢనమ్మకం ఇంకా బలపడుతుంది. దయ్యాలు న్నాయని వాళ్ళు బల్లగుద్ది వాదిస్తుంటారు. నీలాంటి బాగా చదువుకున్న వాళ్ళే ఇలాంటి మూఢనమ్మకాలకు లోనైతే ఇక చదువుకోని నిరక్ష రాస్యులకు ఇలాంటి నమ్మకాలుండటంలో ఆశ్చర్య మేముంది? మనం వెనక్కి పోతున్నామో, ముందుకు పోతున్నామో నాకర్థం కావడం లేదు" అన్నాన్నేను. ◆

భస్మీ పటలం కాక తప్పదు

నీసొత్తు ఇమ్మని అడగలే...
బడా బ్యాంక్ 'విత్తం' అడగలే...
వరుణుడు కరుణించాడని
కాసిన్ని విత్తులు అడిగారు
అడిగిందే తడవు కాల్చమని ఆర్డరేశావు
లాఠీలు తూటాలు ఎందుకంటే
శాంతి భద్రతలకంటావు
నీదురాగతాల చిట్టా జనం విప్పక తప్పరు
స్వర్ణాంధ్రా చేయమని నీనుదట
బొట్టెవడు పెట్టాడు
కాబూళీవాల కట్టుబాట్ల కోసం
కోట్లాది జనుల శ్రమను కొల్లగొడుతున్నావు
బుక్కెడు బువ్వ
గుక్కెడు నీరు
కాసింత గూడు
ఇవి చాలు మాకు
నీ తిరుపతి వరాల
లాఠీల తూటాల తీరు మాకొద్దు
నీ ప్రైవేటువర్ల కోసం మా ప్రాణం తీయకు

నీవు కాల్పుల ఆర్డరు వేసింది
చెమట నెత్తురును అత్తరు పన్నీరుగా
నీకందిస్తున్న అన్నదాతపై
ఏడేళ్లుగా ఆంధ్రుల ఆశలను, భవిష్యత్తును,
వర్తమానాన్ని
బుగ్గి పాల్జేశావు
కడుపు మండిన కార్మికుడో
వెన్నువిరిగిన అన్నదాతో
నీ స్వర్ణాంధ్రాకు డెత్ వారెంట్ ఇష్యూ చేస్తాడు
నీక(ల్ల)ల స్వర్ణాంధ్రా సమాధికి
రాయిని, సున్నాన్ని వేసేది వారే
చేవెళ్లలో పేలిన తూటా సాక్షిగా
రైవాడ రైతుల సాక్షిగా
కల్దారి కాల్పుల సాక్షిగా
విద్యుత్ పోరులో నేల కొరిగిన అమరుల
సాక్షిగా
నీక(ల్ల)ల స్వర్ణాంధ్రా భస్మీపటలం కాక తప్పదు

జి.బుచ్చయ్య

లోకం పోకడ

ఆత్మాహుతికి పిలుపునిచ్చే
స్వదేశీ ఉగ్రవాదం
అజ్ఞానానికి పరాకాష్ట
సొంతగూడు తగులబెట్టే
ఆవేశకాషాయాలు
కాలుతున్న పూలతోటలా
మంట కలిసే మానవత్వపు విలువలు
కులం పునాదులపై నిర్మితమైన
"రెడ్డి"నాయుళ్ళసిని మా(య)లు
ప్రేక్షకుల జేబు కొల్లగొట్టే ఉపాయాలు
రెండుకళ్ళు చాలని టీ.వీ. సీరియళ్ళు
కాగితం పూల నవ్వులు- గ్లీజరిన్ కన్నీళ్ళు

రంగుపులుముకున్న
ఆప్యాయతాను బంధాలు-
గోరంత ఎర వేసి కొండంత
దోచుకునే వాణిజ్య ప్రకటనలు
పుట్టగొడుగు "ప్రైవేటు" బ్యాంకులు
అసలుకే ఎసరు పెట్టే కుచ్చుటోపీలు
పాకుతున్న అవినీతి జబ్బుకి
ఖాంటవ దహనం జరగాలి.
ఇది అన్నార్తుల హాహారాలు వినిపించని
వింత లోకం
మేకవన్నె పులులు సంచరించే
జనారణ్యం

మార్కాపురం శ్రీనివాసరావు

✻ అమ్మిన శ్రీనివాసరాజు

హింసకు దూరంగా ఉంచాలి

అది రెండవ తరగతి. తరగతి గది టీచర్ లెక్కల క్లాసు చెబుతున్నారు. అప్పటికీ అర్థగంట నుంచీ తాను చెబుతున్న లెక్కలను ఏమాత్రం లెక్కచేయకుండా పక్క పిల్లలతో గడుపుతున్న రవిని మందలింపుగా బెత్తంతో ఒక్క దెబ్బవేశారు టీచర్. అంతే రవి టీచర్ కొట్టిన బెత్తాన్ని అలాగే పట్టుకుని టీచర్ మీదకు ఎదురు తిరిగాడు. ఊహించని పరిణామానికి టీచర్ నివ్వెర పోయారు. రవి కళ్ళల్లో ఆవేశం. పక్కనే ఏదైనా రాయిలాంటిదుంటే విసిరేసి పారిపోదామనే ఆరాటం....

ఇది చదవడానికి, వినడానికి నమ్మలేకుండా వున్నా ఇటీవల ఒక మారుమూల గ్రామీణ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సజీవ సత్యం. అందునా అమాయకతకు ఆలవాలం అయిన గ్రామీణ పాఠశాలలోనే ఇలాంటి సంఘటన జరిగిందంటే అన్ని విధాల అభివృద్ధి చెందిన పట్టణాల పరిస్థితి, అక్కడి పిల్లల పరిస్థితి గురించి ఆలోచించాలి.

పరిణామాత్మకంగా సమాజంలో వస్తున్న ఆధునిక ధోరణుల్లో భాగంగా పిల్లల అభ్యాస ప్రక్రియల్లోనూ, ఆటల్లోనూ కనిపించని రూపంలో ఈ హింసా ప్రవృత్తి ప్రవహించి అనేక విధాల అవాంఛనీయ సంఘటనలకు పరోక్ష కారకం అవుతుంది.

పిల్లలు కాలక్షేపానికి చూసే మీడియా దగ్గర నుండి ఉల్లాసం కోసం ఆడే ఆటల్లోనూ, ఆటవస్తువుల్లోనూ ఈ 'హింసా' మసూచి ఆవహిస్తుంది. పిల్లలు ఆడే ఆటల్లో 'దొంగా పోలీస్ ఆట' చూడటానికి ప్రమాద రహితంగా పైకి అనిపించినా లేతహృదయాలపై దాని ప్రభావం అధికంగా వుంటుంది.

ఇక పోతే ఈ మధ్య మీడియా పుణ్యాన పిల్లలు ఆడే ఆటల్లో కార్గిల్ యుద్ధం, ఆఫ్ఘన్ యుద్ధం, ఇరాక్ యుద్ధం అనిచోటు చేసుకుని ఆయా వ్యక్తుల పేర్లు పెట్టుకుని పిల్లలు ఆడుకుంటుంటే పెద్దలు సరదా, హాస్యాలను అనుభవిస్తున్నారే తప్ప దాని ద్వారా ముందుకొచ్చే ముప్పు గురించి ఆలోచించడం లేదు.

ఇక ఆటలే కాకుండా ఇప్పుడు మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న ఆటబొమ్మల తీరుకూడా అందుకు పూర్తి సానుకూలంగా వుంటున్నాయి. ప్రస్తుతం వస్తున్న ఆట తుపాకులు నిజం తుపాకులను పోలి వుంటున్నాయి. వాటిని పోలిన శబ్దాలు చేసేవి, దెబ్బలు తగిలించేవి కూడా వుంటున్నాయి. బిన్‌లాడెన్ తుపాకి అని ఇటీవల విడుదలైన ఆటబొమ్మ తుపాకీ పెద్ద ధరతో పాటు పిల్లల ఆదరణ కూడా పెద్దగానే పొందింది.

ఇటీవల పిల్లల ఆటవస్తువుల్లో ఎ.కె.47 తుపాకులు, విల్లంబులు, షూటింగ్ గన్‌లు మొదలైనవి విరివిగా వస్తున్నాయి. పిల్లల్ని ఆనందపరిచే ఉద్దేశంతో ఆటవస్తువులు ఎలాంటి వనే భావం కోల్పోయి



అడ్డగోలుగా ఆట బొమ్మలనుకొని అందిస్తూ ఆ ధోరణికి ఆహ్వానం పలుకుతున్నారు నేటి ఆధునిక పెద్దలు - తల్లిదండ్రులు.

మన దగ్గర పరిస్థితి ఇలా వుంటే పక్క దేశాల్లో కూడా పిల్లల్లో పెరుగుతున్న ఈ హింసాత్మక ధోరణిని అంతం చేయడంలో భాగంగా ఆయా దేశాలు అటువంటి హింసాపూరిత ఆటవస్తువులను తమ దేశాల నుండి బహిష్కరిస్తున్నాయి. అటువంటి బహిష్కృత వస్తువులను విదేశీ వస్తు వ్యామోహ పరులమైన మనం అధికమూల్యం చెల్లించి అతి ప్రేమగా కొనుక్కుని వ్యామోహంగా దాచి పిల్లలకు బహుమతుల రూపంలో అందించి మన ఘనత చాటుకుంటున్నామంటే మన మెంత ఘనులమో ఒక్కసారి ఆలోచించుకోవాలి!

కేవలం ఈ ఆటవస్తువుల ద్వారా ఇంత రాద్ధాంతం వుందా? విడ్డూరం కాకపోతేను! అని ఆక్షేపించే వారూ లేకపోలేదు. కాని ఇది అక్షరాల నిజం! అనుకరణా ప్రతిరూపకాలైన ఈ బాలల్లో ఇవి తప్పకుండా ప్రభావం చూపుతాయి అని పిల్లల మనస్తత్వ నిపుణులు ఒకవైపు చెబుతూనే వున్నారు. అందుకు సంబంధించిన సంఘటనలు కూడా ఇటీవల జరిగినట్లు ప్రత్యక్ష వ్యక్తుల వర్తమానాలు. తెలియజేస్తున్నాయి.

ఒక ప్రక్క సినిమాలు, టీవీ, ఇతర మీడియాల ద్వారా హింసా ప్రవృత్తి పెచ్చుమీరుతుండగా బాల్యం నుంచే ఆటవస్తుల రూపంలో కూడా పిల్లల్ని హింసాత్మక ధోరణికి దాసోహం చేయడం ఎంత దారుణమో అందరూ ఆలోచించాలి. వీటిద్వారా ప్రేరణ పొందిన పిల్లలు పెద్దయ్యాక తప్పకుండా అరాచక శక్తులుగా, సంఘ వ్యతిరేకులుగా తయారవుతారు. కాబట్టి పెద్దలు తల్లిదండ్రులు తమ పిల్లల పైగల వ్యామోహంతో చేజేతులా వారి బంగారు భవిష్యత్‌ను హింసారూపంలో పడవేస్తున్నాము అనే నగ్న సత్యాన్ని గ్రహించాలి.

ప్రతి తల్లిదండ్రీ, పెద్దలు, అధ్యాపకులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లల్ని హింసా ధోరణి నుండి దూరం చేయాలి. దాని ద్వారా కలిగే అనర్థాలు వివరించాలి. ఆటవస్తువుల విషయంలో ఆటల విషయంలో కూడా జాగ్రత్త తీసుకుని హింసాకారక ప్రేరక వస్తువులను పిల్లల దరిదాపుల్లోకి రాకుండా చేయాలి. అంతేగాక హింసాత్మక ధోరణుల ద్వారా కలిగే అనర్థాల గురించి అర్థమయ్యేటట్లు వివరించి పిల్లల్లో హింసపట్ల విముఖత తీసుకు రావాలి.

తుపాకి బొమ్మ పట్టుకోవడం హీరోయిజం కాదని అదొక దుర్మార్గ పాత్ర లక్షణంగా చిత్రించి పిల్లలకు చెప్పాలి. వారు ఆడే ఆటల్లో కూడా హింసా కారక ఆటలు లేకుండా చూడాలి. అలాంటి వుంటే వెంటనే నిరోధించాలి. అస్తమానం పిల్లల ఆటల్లో దొంగా పోలీస్, యుద్ధం, ఫైటింగ్ లాంటివి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

భవిష్యత్తులో పిల్లలు పూర్తిస్థాయిలో శాంతియుత పౌరులుగా రూపొందాలంటే వారి భవిష్యత్ సుభిక్షంగా గడవాలి. అంటే ఇప్పటినుండే పిల్లల ఆటల్లోనూ, ఆటవస్తువుల కొనుగోలులోను తల్లిదండ్రులు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించి పిల్లలు హింసాధోరణికి దాసోహం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. ఈ విషయం గురించి అందరూ విశాల దృక్పథంలో దృష్టి సారించాల్సిన అవసరం ఆసన్నమైంది. ◆

దురాశ

రాజు, రాము, రంగ ... ముగ్గురూ మంచి స్నేహితులు. ఏ పని చేసినా కలిసి చేసేవారు. ప్రతిరోజూ దగ్గర్లోని దండకారణ్యంలోకి వెళ్లి కట్టెలు కొట్టుకుని జీవనం సాగించేవారు. కట్టెలు కొట్టడం వల్ల వచ్చే ఆదాయం వారికి అరకొరగా సరిపోయేది. ఏదో ఒకరోజు మంచి జరుగుతుందని ముగ్గురూ కలలు కంటుండేవారు. ఒకరోజు ముగ్గురూ అడవిలో కట్టెలు కొడుతుండగా రంగకు ఒక రాతి బండ సమీపంలో కొన్ని బంగారు నాణేలు కనిపించాయి. అతను వాటిని మిగిలిన ఇద్దరికీ చూపించాడు. 'ఆహా... రంగా ఇవి బంగారు నాణేలురా... ఎక్కడ దొరికాయి చూపించు' అన్నాడు రాజు. అవి తనకు దొరికిన ప్రదేశం చూపించాడు రంగ. ముగ్గురూ కలిసి అక్కడ మోకాలి లోతు తవ్వేసరికి వారికి బంగారు నాణేల పెట్టె ఒకటి దొరికింది. పెట్టెను ఆత్రుతగా తెరచి చూశాడు రాము. అంతే! కళ్లు మిరుమిట్లు గొలిపేలా బంగారు ఆభరణాలు, నాణేలు, వజ్రవైఢూర్యాలు, రత్నాలు కనిపించాయి. వాటిని చూసిన రాజు, రంగకూ అమితానందం కలిగింది. ముగ్గురూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని 'ఇవాల్టితో మన కష్టాలు తీరిపోయాయి. ఇప్పుడు మనం ధనవంతులమయ్యాం. ఇంక ఏ పనీ చేయకుండా కూర్చుని తినవచ్చు' అనుకున్నారు. అంత ధనం ఒక్కసారిగా కనిపించేసరికి ముగ్గురిలోనూ దుర్మార్గపు ఆలోచనలు చెలరేగాయి. ఒకరినొకరు అంతం చేయాలనుకున్నారు.

రాజు, రాము కలిసి కళ్లతో సైగలు చేసుకుని 'ఒరేయ్ రంగా! ఇంతవరకు మనం పేదరికం మూలాన సరైన గుడ్డ కట్టుకోలేకపోయాం. పొట్టనిండా మంచి తిండి తినలేకపోయాం. కాబట్టి నువ్వు పట్నం వెళ్లి, మనం ఇంతకు ముందెన్నడూ తిని ఎరగని రుచికరమైన ఆహారం తీసుకురారా' అంటూ ఒక బంగారు నాణేన్ని చేతిలో ఉంచారు. సరేనని రంగ పట్నం వెళ్లాడు. తమ పన్నాగంలోని మొదటి అంకం పూర్తి అయినందుకు రాజు, రాము ఇద్దరూ సంతోషించారు. కొద్ది గంటల తర్వాత రంగ ఆహార పదార్థాలతో తిరిగి వచ్చాడు.

'ఒరేయ్ రంగా! మన ముగ్గురిలోకి నువ్వే చిన్నవాడివి. మాకు ఇష్టమైన వాడివి కూడా నువ్వే. కాబట్టి ఈ నిధిని నువ్వే మూడు వాటాలుగా పంచితే బావుంటుందిరా' అని రాజు రాములిద్దరూ రంగని కోరారు. సరేనంటూ కిందకు వంగి నిధిని మూడు వాటాలుగా పంచుతున్నాడు. ఈలోగా రాజు, రాము ఒక పెద్ద బండరాతిని పైకెత్తి రంగ తలపై వేశారు. అంతే! రంగ 'అమ్మా!' అంటూ పెద్దగా ఆర్తనాదం చేస్తూ తలపగిలి అక్కడికక్కడే మరణించాడు. ఉన్న నిధి అంతా ఇక తమ ఇద్దరిదే అనుకుంటూ ఇద్దరూ అతడి శవాన్ని పక్కనే వున్న పొదలోకి లాగేశారు. నిధిని చెరిసగం చేసుకుని రంగ తెచ్చిన పంచభక్షపరమాన్నం తిన్నారు. అంతే రాజు, రాము కూడా రక్తం కక్కుకుని మరణించారు. రంగ అంతకు ముందే రాజు, రాముని చంపడానికి ఆహారంలో విషం కలిపాడు. కాని ఇద్దరు మిత్రుల కుట్రకు బలైపోయాడు. అలా ముగ్గురు మిత్రులు ధనాశతో ఒకరినొకరు చంపుకున్నారు. మృత్యువు ఒడిలోకి చేరుకున్నారు.

బండారు దుర్గాప్రసాద్



క్విజ్-64

1. మనదేశంలో అత్యధిక జనాభాగల పట్టణం?
   ఎ.హైదరాబాదు బి. కొల్‌కతా
2. ఉచిత వస్తువు ఏది?
   ఎ.గాలి బి. కరెంటు
3. 'హారి పోటర్' రచించినదెవరు?
   ఎ. మరియా మాంటిసోరి బి. జోన్నె కాథలీన్ రౌలింగ్
4. పాలను పెరుగుగా మార్చేది?
   ఎ. ఆల్గే బి. బ్యాక్టీరియా
5. శ్వాసక్రియలో గ్రహించేది?
   ఎ.ఉదజని బి.ఆమ్లజని
6. ప్రపంచంలోకెల్ల గట్టి పదార్థం?
   ఎ. రాయి బి. వజ్రము
7. బోధన్ పంచదార కర్మాగారము ఇక్కడ వుంది?
   ఎ. ఆదిలాబాదు బి. నిజామాబాదు
8. చతుర్భుజమునందలి నాలుగు కోణముల మొత్తం?
   ఎ.360 డిగ్రీలు బి. 180 డిగ్రీలు
9. మూత్ర పిండము ఏ ఆకారంలో వుంటుంది?
   ఎ.చిక్కుడు గింజ
   బి.చక్రము
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. అలెజాండ్రో టోలెడో
   బి. బియాట్రిజ్ మెరినో

ఉడుత సవాల్

ఈ ఫొటోలోని ఉడుత మిమ్మల్ని చూసి ఒక సవాల్ విసురుతోంది. అదేంటంటే..! 'మీరు పెద్ద ఏవేవో బొమ్మలు వేస్తారుగదా. అసలు ఎప్పడైనా నా బొమ్మ వేయడానికి ప్రయత్నించారా? మీకేగాని డ్రాయింగ్ వస్తే... 1వ నెంబరు బొమ్మలో నన్ను చూసి 2వ నెంబరు బొమ్మ వేయండి చూద్దాం' అంటోంది. మరి మనం మాత్రం తక్కువ తిన్నామా ఏంటి? గబగబా పెన్సిల్ తీసి వేసేద్దామా! ఆ... ఆ తర్వాత రంగులుకూడా వేద్దాం. అప్పుడుగాని ఉడుత తిక్క కుదరదు. లేకపోతే మనకే సవాల్ విసురుతుందా!!



చిన్నారి చిత్రకారులు



కె.సాహిల్, 1వ తరగతి, పిఅండ్‌టి గ్యాన్‌దీప్ స్కూల్, అశోక్‌నగర్, హైదరాబాదు.



గోరంట్ల భరత్, 3వతరగతి, హైదరాబాదు.



ఎ.అనీల్, 5వతరగతి, కెరీర్ పబ్లిక్ స్కూల్, శ్రీకాకుళం.



ఎ.శివ, 7వ తరగతి, విశాలభారతివిద్యాలయం, జగిత్యాల.

ఈ బంధాన్ని విడదీయగలరా?

మేజిక్ మేజిక్!!

ఇప్పుడు మనం చెప్పకోబోయే మేజిక్ భలే తమాషాగా వుంటుంది. ఈ మేజిక్ చేయడానికి ముగ్గురు చాలు. ఇద్దరు ఎదురెదురుగా నిలబడి చేతులు చాచాలి. అప్పడు మూడో వారు, వారి చేతులను కింద బొమ్మలో చూపించినట్టు చిన్న తాడుతో కట్టేయాలి. రెండు తాళ్లూ ఒకదానితో ఒకటి చుట్టి వుంటాయి. ఇప్పడు ఈ బంధాన్ని విడతీయాలి. అంతే. ఐతే వాళ్ల తాటిని కత్తిరించకూడదు. ముడివిప్పకూడదు.



ఎలాగో తెలియడంలేదా? అయితే నే చెప్పనా! ఒక తాటి మధ్యభాగాన్ని మీ మిత్రుని చేతి చుట్టూ వుండే తాడు కిందగా పంపాలి. ఆ తర్వాత అతని వేళ్ల మీదగా పంపాలి. అప్పడు తాడు మధ్య భాగాన్ని మళ్లీ తాటికింది నుంచి వెనక్కు తీసుకురావాలి. అప్పడు తాళ్లు విడిపోయి వుంటాయి. అంతే...!

కలంస్నేహం

పేరు: ఆర్.భరత్‌కుమార్,
వయసు : 11సం॥
చదువు :6 వతరగతి
హాబీలు : బాలనేస్తాలు, చిన్నారి చదవడం అంటే నాకు ఇష్టం.
పూర్తి చిరునామా : ఆర్.భరత్‌కుమార్, సన్నాఫ్ ఆర్.పుల్లయ్య, .కిరాణాషాపు, గాంధీరోడ్, వేంపల్లె, కడప.

పేరు:టి.సాయివాణి,
వయసు : 12సం॥
చదువు :6వతరగతి
హాబీలు : కలంస్నేహం, చదువుకోవడం, పాటలు పాడడం, కొత్త నేస్తాలను అందించే ఈ శీర్షిక చూడడం.
పూర్తి చిరునామా :టి.సాయివాణి, 6వ తరగతి, రాహుల్ స్కూల్, ...ల, ప్రకాశం.

నేస్తాలూ... మీకు కూడా కలంస్నేహం చేయాలని వుందికదూ. ఆలస్యం చేయకుండా పోస్టుకార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాసి, ...తో అంటించి మాకు పంపండే.



క్విజ్ 63 జవాబులు

1.బంగాళాఖాతము 2. శ్రీకృష్ణదేవరాయలు 3. కాళిదాసు 4.ఎరుపు 5. హిమోగ్లోబిన్ 6. చిదపకూడదు 7. శ్రీహరికోట 8. ఎత్తు 9. ఖుర్రం 10. జింటావో

క్విజ్ 62కి సరైన సమాధానాలు రాసిన వారు :

వి.పుల్లారావు, 10వ తరగతి, **యు.యేసేబు**, 10వ తరగతి, యర్రగొండపాలెం, ప్రకాశం. **పెంటకోట ...మర్‌జయసింహ**, గవరపాలెం, అనకాపల్లి, విశాఖ. **...నీలిమ**, 7వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **...సునందిని**, 9వ తరగతి, **జి.అన్నపూర్ణ**, 7వ తరగతి, ...తపొన్నూరు, గుంటూరు. **ఎం.వెంకటేశ్వర్లు**, 8వ తరగతి, గవరపాలెం, విశాఖ.

చిత్రపటం

హాయ్‌నేస్తాలూ...
ఈ వారం నుంచి అక్బర్-బీర్బల్ కథలు చెప్పకుందామే. 1526వ సంవత్సరంలో మొఘల్ వంశాన్ని స్థాపించాడు బాబరు చక్రవర్తి. ఈయన మనవడు, హుమాయున్ కుమారుడు అక్బర్. వీరి రాజధాని ఢిల్లీ. అక్బర్ చిన్నపిల్లవానిగా వున్నప్పడే తండ్రి మరణించాడు. బైరాంఖాన్ సహాయంతో 13 సంవత్సరాల వయస్సులో ఢిల్లీ సింహాసనం ఎక్కాడు. ఈయన హాస్య ప్రియులు.
బీర్బల్ మధ్యప్రదేశ్‌లోని పతన్ అనే గ్రామంలో పుట్టాడు. ఆయన తండ్రి మంచి పండితుడు. అంతేగాక హాస్యప్రియుడు. అదేవిధంగా బీర్బల్ కూడా చక్కటి హాస్యంతో మాట్లాడేవాడు. 18 సంవత్సరాలు నిండేసరికి తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఆనక ఒకటి రెండేళ్లు స్వగ్రామంలోనే రోజులు వెళ్లబుచ్చినా... ఆ తర్వాత ఢిల్లీ చేరుకున్నాడు. బీర్బల్ అక్బర్ ఆస్థానంలో చేరిన సంఘటన భలే విచిత్రంగా వుంటుంది.అదెలా? అనేది ఈ 'చిత్రపటం' కథ చదివితే తెలుస్తుంది.

అక్బర్-బీర్బల్ కథలు

బీర్బల్ ఢిల్లీ నగరం చేరుకునేసరికి అక్బరుకు 30 సంవత్సరాలు. అక్బరుకు చమత్కారంగా మాట్లాడే వారంటే చాలా ఇష్టం. కానీ ఆయనతో అలా మాట్లాడేవారు ఎవరూ అక్కడ లేరు. అందుకని, అచ్చు తనలాగే చిత్రపటమును వేసి తెచ్చి చూయించినవారికి వెయ్యి వరహాలు బహుమానం ఇస్తానని ఒక ప్రకటన చేయించాడు. ఆనోట, ఆనోట ఆ మాట బీర్బల్ చెవిలో పడింది. వెంటనే బీర్బల్‌కు ఒక ఆలోచన వచ్చింది.

అక్బర్ పాదుషాకి ఆయన చిత్రపటం చూపించవలసిన రోజు రానే వచ్చింది. చక్రవర్తి ఆస్థానం అంతా చిత్రకారులు, కవులు, పండితులు, పామరులు, ఉద్యోగులతో నిండిపోయింది. వారిలో బీర్బల్‌కూడా ఉన్నాడు. అందరి చేతుల్లోను చిత్రపటాలే. బీర్బల్ చంకలోకూడా ఒకటుంది. అక్బర్ చక్రవర్తి అందరి పటాలు చూసి పెదవి విరుస్తున్నాడు. బీర్బల్ వంతు రానే వచ్చింది. అక్బర్ బీర్బల్‌ని చూడడంతోటే 'ఉన్నదున్నట్టుగా వేశావా? లేక వీరికి మాదిరిగానే వేశావా?' అని ప్రశ్నించాడు. 'ప్రభూ మీరు ఇప్పడెలా వున్నారో చిత్రపటంలోకూడా అలాగే వున్నారు. చిత్తగించండి' అని తన చేతిలో వున్న పటాన్ని తీసి అక్బర్ ఎదురుగా పెట్టాడు. అంతే... దాన్ని చూసి అక్బర్ పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాడు. మరి నిలువుటద్దంలో చూస్తే ఎవరైనా ఎలా కనపడతారు? ఉన్నదున్నట్టుగా. అంతేకదా. అప్పడు అక్బర్ సింహాసనం నుంచి లేచి బీర్బల్‌ను కౌగిలించుకున్నాడు సంతోషంగా. 'నీవు ఇవాల్టినుంచి దర్బారులోనే వుండాలి. నీ హాస్యంతో నాకు వినోదం కలిగించు' అని తన ఆస్థానంలో చేర్చుకున్నాడు. ఇది నేస్తాలూ అక్బర్-బీర్బల్ మొదటి కథ. వారంవారం తప్పకుండా చదవండే.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	పా
	వర్
	క్కరి
	మోటా
	న్ను
	ప్

గతవారం జవాబులు

స	లకము
	గము
	ర్షము
	జావుగా
	మయము
	ప్తపది

టెలిక్లినిక్ - యగసాయం హుళుక్

కురవి సంత నుండి సాయంత్రం తిరిగొచ్చిన గురవయ్య బజార్లో ఒకటే గెంతులు. సాధారణంగా గురవయ్య అట్లా చిందులేసే మనిషి కాదు. కాని చిత్రంగా కురవి సంతలో అరకాయ బ్రాందీ పుచ్చుకున్నాడు కాబట్టి అట్లా చిందులకు తగులుకున్నాడు. పంచె ఓ పక్క వూడిపోతున్నా ఉద్రేకంగా కేకలు కూడా పెడుతున్నాడు.

"అవునెస్సె... అమ్మిపారేసిన... రెండెడ్లనూ అమ్మిన... రెండు వేలొచ్చినై! రెండొందలు కర్చు పెట్టి కలరు సార తాగిన... ఓరి బామ్మర్దీ... నీ గిత్తల్ని కూడా అమ్మి పారెయ్... ఇంగ మనకు వాటితోని పనిలేదెహె... అంతా గా టిలిఫోనుంటే సాలు.. ఇంగ ఎండలబడి... వాన్ల తడ్సి... చింకిరి పింకిరి గావొద్దుర... గంతే... ఈ యెగసాయానికి నా... ఇంగ జూపిస్తరా నా దెబ్బ..." వాడు అట్లా లపలప తొడలు చరిచి సవాలుచేస్తుంటే ముందుజక్కులోడు నివ్వెర పడి.. బుర్ర పని చేయక వాడ్నే పరిశీలనగా చూశాడు. వాడు జక్కులోడ్ని లాక్కుని రాగిచెట్టు చప్టా మీదే కూలేసినాడు. వాడికేం అర్థంగాక గురవయ్య కేసే మిర్రిమిర్రి చూస్తున్నాడు.

"ఏంది గురవయ్య మావా... వానలవీ వచ్చే రోజులాయె... నీకేం రోగం పుట్టిందని గట్ల అరక ఎడ్లను అమ్మి పారనూకినవ్..." బహు ఆందోళనగా అడిగాడు.

"యగసాయానికే అమ్మింది మరి... మరిపుడు మనందరం టెలిఫోను యగసాయం చెయ్యాల్నాయె... ఇంగ ఈ ఎడ్లూ... అరకలూ బంద్! అంతా టీవీ యగసాయం..."

అపుడే యాద్గిరి బీడీ పారేసి వచ్చాడు గదా... జక్కులోడికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఎగిరీ ఎగిరీ గురవయ్య చప్టామీద సోయి తప్పి గుర్రులోకి జారుకున్నాడు.

"ఏందిర అన్న... వీడేందో టెలిఫోనూ.. టీవీ యగసాయం అంటండు... అరె... ఏందో మతలబు" జక్కులోడు బిత్తరగా అడిగాడు.

* * *

అక్కడంతా చాలా రద్దీగా ఉంది... కేరింతలు కొడుతూ రైతన్నలు గుంపుగా ఎగబడ్డారు. అందరిలోనూ ఒకటే ఆరాటం.. వురకలేసే పూనకం!

"ఇంగ మనం టెలిఫోన్లో జిల్లాకు మాట్లాడ్తె... ఇంగ గక్కడ్నుండే మనకు యగసాయం నేర్పిస్తరు.. అబ్బో... ఎప్పటికప్పుడు కొత్తరకం... కొత్త కొత్త వంటలు వండిచ్చుకుని లచ్చలు సంపాదించుకోవచ్చు" రంగయ్య బొళబొళ నవ్వుతూ చెప్తున్నాడు.

"అదీకాదు... ఎరువులు... పురుగుల మందులు అన్ని యవ్వారాలు వీళ్ళే అందిస్తరు... అబ్బ... వెయ్యి మందికో డాక్టరు.. సలహాలు చెప్తడు." గోపాలం పరవశించి పోయాడు. యాద్గిరి, జక్కులోడు చోద్యం చూస్తూ 'సమాచార సాంకేతిక పరిజ్ఞానం... టెలిఆగ్రోక్లినిక్‌లు... కాల్‌సెంటర్' దగ్గర నిలబడ్డరు.

"టెలిక్లినిక్ అంటే యగసాయానికి రోగం వస్తే నయం చేసే దవాఖానాలన్నమాట... ఇంకా డిజిటల్ కెమెరాల్తో వీడియోలు దీస్తరు. రోగాలు రాకుండ జూసే ఆసుపత్రులకు పంపుతరు. టీవీల్ల చూపిస్తరు.." యాద్గిరి సముదాయిస్తూ అన్నాడు.

ముందు రంగయ్య టెలిఫోనందుకున్నాడు. "అయ్యా నేను రంగయ్యను... నా రెండెకరాల పొలంలో ఏ పంట వేస్తే బాగుంటుంది... ఆదాయం బాగా వచ్చే ఉపాయం వూదండి" అని ఆబగా అడిగాడు.

"ముందు ఈ పొలం చుట్టూ వాటర్ పెద్ద కట్టండి.... నీరు నిల్వ ఉంటుంది.. దాన్లో కొర్రమీనులు పెంచొచ్చు.. ఎకరాకు లక్ష దాకా ఆదాయం... చేప పిల్లల్ని హాంకాంగ్ నుండి పొందడానికి ఇంటర్నెట్‌ను మీటండి" రంగయ్య దబ్బున విరుచుకు పడ్డాడు.



తర్వాత గోపాలం గొంతు సవరించుకుని ఫోనందుకున్నాడు. "అయ్యా నా అయిదెకరాల తోట... బోరుబావీ వున్నై... కరకట్టలు చెప్పకండి... తోటలో ఏ పత్తి రకం వెయ్యాలె.. ఎట్లా వెయ్యాల్నో చెప్పరా?"

"వీడియోలో మీ తోట నేలను పరిశీలించామండీ... దాన్లో పత్తికన్నా గుత్తివంకాయ శ్రేష్టం... సింగపూర్‌లో వాటికి యమా డిమాండు.. బోల్డు ఆదాయం... బోరుబావి కరంటు మోటార్ని వెంటనే పీకేయడం మంచిది. ఎందుకంటే ఇక ముందు ఆర్నెల్లకోసారి కరంటు ఛార్జీలు పెంచందే ట్రాన్స్కో నడవదు. తోట చుట్టూ ఇంకుడు గుంతలు తవ్వండి.. ఎందుకైనా మంచిది.. శాస్త్రీయంగా ఆ ఊటతో పంట ఏపుగా వస్తుంది.." గోపాలం అరుచుకుంటూ గోచీ వూడుతున్నా ఆగకుండా అక్కడి నుండి పరారై పోయినాడు.

తర్వాత టీవీ ఆన్‌చేయగానే ఇంటర్నెట్‌లో రకరకాల దేశాల వ్యవసాయ పద్ధతులు.... ట్రాక్టర్లు.. స్ప్రింక్లర్లు.. అబ్బో... విరగబూసిన పూలు... విరివిగా పండ్లు... గెంతే చేపలు... ఎగిరే కొంగలు...

"రోజూ రైతు సోదరులంతా నాలుగైదు గంటలు క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని గాని చూస్తే శాస్త్రీయ వ్యవసాయం... పద్ధతులు... ఈ సమాచార సాంకేతిక విజ్ఞానం ద్వారా మీకు అందుతుంది.... మీ వున్న కొంపాగోడూ బ్యాంకుల్లో కుదవకేసి పెట్టుబడులు పెట్టి ఇవి అమలు చేసుకోవడం బెటరు.. ఇది హైటెక్ అగ్రికల్చర్..

గుండు దెబ్బకు పరారయ్యే పిట్టల్లా రైతన్నలందరూ ఒక్కసారే ఆ కేంద్రం నుండి 'హోలో'మని సందుగొందుల గుండా పరుగులు పెట్టారు.

"ఒరే యాద్గిరీ.. యగసాయం డాక్టరు నా భూవి మట్టి పరీక్ష చేసి... అసలు ఏకమొత్తం మట్టినే మార్చి పారనూకితేగానీ అదిక ఏ పంటకూ పనికిరాదని రిపోర్టు రాసిచ్చిండు - భూవిని మార్చుడం ఎట్లనో తెలవక బుర్రబద్దలు కొట్టుకుంటున్నా..." నక్కలోడు యాద్గిరితో దిగాలుగా అనంగానే జక్కులోడు దబ్బున కిందపడి లేచి నుంచున్నాడు.

ఓరి జక్కులోడా ఇది నా పొలం రిపోర్టు... అదుగో డిజిటల్ కెమెరాలో ఫొటోలు తీస్తే ఆఫీసరు సలహాలు చెప్పాడు. సూడు" యాకయ్య ఓ రిపోర్టు అందించాడు. అది 'టెలి కన్సల్టెన్సీ' వారిచ్చింది. దాన్లో "నీ పొలంలోని నేల అద్భుతం... దానిలోని పోషక విలువలు పరమాద్భుతం.. వాస్తు రీత్యా దాన్లో ఏ గ్రహదోషమూ లేదు.... ఏ పంట చేసినా ఎరువు మతలబులేకుండా విరివిగా పండును. ధోకా లేదని గమనింపుము.. విదేశీ విత్తనాలు విరగపండును...

నోటు : ఏ పంటవేసినా ఆ పంటకు నీళ్ళు అస్సలు అవసరం లేనిపంటనే బహుజాగ్రత్తగా ఎంచుకొనుము... దానికి కాంబోడియా కన్సల్టెన్సీని సంప్రదించుము.."

యాద్గిరి చదవంగానే యాకయ్య వెర్రికేక పెట్టి చప్టామీద విరుచుకు పడిపోయాడు. జక్కులోడికి ఈ 'వ్యవసాయం.. ఫోను.. సలహాలు' అన్నీ తికమకగా వుండె.. యాద్గిరి చాలా నింపాదిగా వివరించాడు.

"ఇది హైటెక్ బాబుగారి బయోటెక్ యవసాయం... అసలు రాష్ట్రంలో ముప్పాతిక భూవులకు ఎట్లాంటి నీటి వసతులు లేవు.. పేద రైతులకు సబ్సిడీ కోత... విద్యుత్ వాత... సహకార బ్యాంకులు అప్పులివ్వవు... ఆకలితో రైతుల విలవిల... బాగా పంటలు పండుతాయని ఓ ప్రణాళిక... రాబోయే ఎన్నికల్లో 'ఓట్లపంట' పండిచ్చుకోడానికి ఎత్తుకున్న కొత్త జిత్తుల్లో ఇదోటి" వింటున్న జక్కులోడు శోషలోకి జారుకున్నాడు. ◆

మగ పుట్టుక పుట్టిం తర్వాత మగాడికి మగ పనులనేకం ఉంటాయని మగాడి థియరీ!

ఇంటో వుండే ఆడమనిషి నోరు మూసుక్కూచోవాలే గాని అతని పనులూ, రోజువారీ కార్యక్రమాలు అడక్కూడదు!

ఈ నియమం ఆదికాలంలో ఆది పురుషుడే పెట్టి వుంటాడు. అంచేత ఆఫీసు పని సాయంత్రం ఆరింటికే పూర్తయితే – ఇంటో ఏడింటికల్లా వుండాలనే రూలుని అతను ససేమిరా పాటించడు. అతని సొంత పనులు పూర్తి చేసుకుని కొంపకి చేరే వేళ రాత్రి పది కావచ్చు. అర్ధరాత్రి కూడా కావచ్చు. ఎందుకింత ఆలస్యంగా వచ్చేరని భార్యామణి అడక్కూడదు!

అంతవరకు భర్త కోసం ఎదురు చూచి అలిసిపోయిన ఇల్లాలు అతను తలుపు తడితే – క్షణం ఆలస్యం గాకుండా తలుపు తీయాలి. బాత్‌రూంకి దారిచూపించాలి. లుంగీ వగైరాలు అందించాలి. కంచం కడిగి అన్నం వడ్డించాలి. భోం చేయడం, చేయకపోవడం అతనిష్టం. భోంచేస్తే కంచం సుబ్బరంగా కడిగి బోర్లించాలి. డోంట్‌వాంట్ అంటే వడ్డించిన కంచాన్ని భద్రంగా దాచి పెట్టి – మరుసటి ఉదయం పని మనిషికివ్వాలి. ఈ యావత్తు తతంగంలో ఇల్లాలు నోరెత్తకూడదు! అదేమిటిదేమిటని అడ్డమైన ప్రశ్నలడక్కూడదు!

అతనికి భయపడి అడక్కూడదని అర్థం కాదు. అడిగితే సరైన సమాధానం చచ్చినా రాదని మగపురాణంలో రాసిపెట్టి వుంది. ఆ రాతని కాదని పంతం కొద్దీ అడిగితే ఆశు కవిత్వం వినిపిస్తాడు. యమధర్మరాజు దున్నపోతు మీంచి పడి పళ్ళూడగొట్టుకుంటే – ఆ పెద్ద మనిషిని ధర్మానువత్రిలో అడ్మిట్ చేసి వచ్చేసరికి ఈ వేళయిందంటాడు. అతను చెప్పే కహానీ నమ్మడం, నమ్మకపోవడం ఇల్లాలి ఇష్టం. ఎప్పుడు చెప్పినా – అతను మాత్రం ఆ బ్రాండు స్టోరీసే చెబుతాడు. అడిగి – అతను చెప్పే అద్భుత వార్తలు వినేకంటే – అస్సలేమీ అడక్క పోవడమే ఉత్తమమని ఆడవాళ్లు ఇప్పుడిప్పుడు గ్రహిస్తున్నారు! ఇంత గ్రహించి కూడా అప్పుడప్పుడు స్వధర్మం మరిచి పోకుండా పప్పులో కాలు వేస్తున్నారు! ఉదహరిస్తాను!

అతను మామూలు గానే చాలా పొద్దు పోయింతర్వాత ఇంటికొస్తాడు. అడక్కూడదనుకుంటూనే ఎందుకింత ఆలస్యమైందని ఇల్లాలు నోరు జారుతుంది.

ఇదొక కహానీ!



వెంటనే యమధర్మ రాజంటూ కహానీ ప్రారంభిస్తాడు. ఆ కథ రెండు రోజుల క్రితమే వినిపించిన వైనం గుర్తుకొచ్చి కేరెక్టరు పేరు మార్చివేస్తాడు! బందరు నుంచి బసవరాజు వచ్చేడని చెబుతాడు. బసవరాజు శ్రీవారికి బెస్టుఫ్రెండని ఆమెకు తెలుసు. అంచేత ఏమిపనిమీద వచ్చేడని భర్తని అడుగుతుంది. భర్త భారంగా నిట్టూర్పు విడుస్తాడు. అనారోగ్యం ఎక్కువవడం వల్ల ఆరోగ్య పరీక్ష నిమిత్తం హైదరాబాద్ వచ్చేడని చెబుతాడు. అయ్యోపాపం అంటుంది ఇల్లాలు. అప్నా హాస్పిటల్లో అతనికి వైద్య పరీక్ష చేసి కేన్సరని చెప్పేరని చెప్పినప్పుడు కన్నీరు పెట్టుకుంటుంది. ఆమె కన్నీరు చూసి తృప్తి పడతాడు. బసవరాజుని ఓదార్చి ధైర్యం చెప్పి రైలెక్కించి వచ్చేసరికి ఈ వేళయిందని కహానీ ముగిస్తాడు!

ఈ కథలో యమధర్మరాజు పాత్ర లేదు గనక ఆమె కాబోలనుకుంటుంది. బసవరాజుకు అనవసరంగా కేన్సరొచ్చినందుకు చింతిస్తుంది. అతని భార్యా పిల్లలు జ్ఞాపకం గా కళ్ళు తుడుచుకుంటుంది. బసవరాజుని బతికించమని మనసులో వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటుంది. ఎంతైనా ఆడమనసు గనక ఈ ఫీట్లు తప్పవు! ఈ గొడవ బొత్తిగా తెలీని బసవరాజు ఆ మరునాడే ఏదో పనిమీద హైదరాబాద్ వస్తాడు. అంతదూరం వచ్చిన వాడు ఫ్రెండుని పలకరించుకుండా తిరుగు ప్రయాణం పెట్టుకుంటే బావుండదని ఫ్రెండింటికి వస్తాడు. గుమ్మం ముందు బసవరాజుని చూడగానే – ఆ అమాయకురాలు అయ్యో అన్నయ్యగారూ మీకెంత ఆపదవచ్చి పడిందండీ అంటూ బావురుమంటుంది. తనకేమి ఆపదవచ్చిందో... ఎందుకు వచ్చిందో... అసలెప్పుడొచ్చిందో వగైరాలు తెలీక ఆ మానవుడు అల్లాడిపోతాడు. ఆమె ఘొల్లుమనడం అన్నయ్యగారు అల్లాడిపోవడమనే ఫీటు గంటకు పైగా సాగి ఆగిపోతుంది. ఆ తర్వాత గానీ అసలు విషయం తెలీదు!

తనకి కేన్సరు రోగం అంటగట్టిన ఫ్రెండుని నెత్తురు కక్కించాలన్నంత కోపమొస్తుంది బసవరాజుకి! ఎంతైనా అతను కూడా మగమనిషి గనక – ఏ అవసరమొచ్చి తనకి కేన్సరు రోగం అంటగట్టేడోనన్న పాయింటుకి వచ్చిన కోపాన్ని దిగమింగుకుంటాడు! మగపుట్టుక పుట్టినందుకు – ఏదో ఆపద సమయంలో అల్లాంటి అబద్ధం చెప్పి వుంటాడని సరిపెట్టుకుంటాడు. పైగా తన చరిత్ర కూడా ఇంచుమించు అంతే! తన భార్యతో కూడా ఆ బ్రాండు అబద్ధాలు అనేకం చెప్పి వుంటాడు. ఆ కథల్లో కొందర్ని మంచమెక్కించి వుంటాడు. మరికొందర్ని టపా కట్టించి కూడా వుంటాడు!

అందువల్ల – బసవరాజు తనతోటి మగాడ్ని వెంటనే క్షమించేస్తాడు! నా మొహాన ఏమి రాసి పెట్టి వుంటే అదే జరుగుతుంది చెల్లెమ్మా! మన చేతుల్లో ఏమీ లేదు గదా అని తత్త్వమొకటి భారంగా బరువుగా చెప్పి చల్లగా జారుకుంటాడు. చెల్లెమ్మ మాత్రం అయ్యో పాపమని అల్లాడిపోతూనే ఉంటుంది. ఆడమనసుకి ఇదొక శాపం! శ్రీవారు చెప్పింది నమ్ముతుంది. శుభవార్త చెబితే సంతోషిస్తుంది. ముదనష్టపు వార్తకి కృంగిపోతుంది. అంతే తప్ప ఆ వార్త ఎంతవరకు నిజమో తెలుసుకునే ప్రయత్నం చేయదు గాక చేయదు. ఇప్పుడే కాదు. ఇక ముందు కూడా ఆ శాపానికి విమోచనా లక్షణాలు బొత్తిగా కనిపించడం లేదు! ◆

* రాకెట్ల వీరన్న

కనువిందు చేసే కొండారెడ్డి బురుజు



వందల సంవత్సరాల చరిత్ర కలిగి, ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఎంతో పటిష్టంగా, చూడముచ్చటగా వున్న 'కొండారెడ్డి బురుజు' చూపరులకు కనువిందు చేస్తోంది. గత ఆంధ్రరాష్ట్ర రాజధాని అయిన కర్నూలులో నగర నడిబొడ్డున ఉన్న ఈ బురుజు కర్నూలుకే అందాన్నిస్తున్నది. కొత్తవారు ఎవరు ఇక్కడికి వచ్చినా దీన్ని తప్పక సందర్శిస్తారు.

గతంలో కర్నూలు నగరాన్ని 'కందనవోలు'గా పిలిచేవారు. కాలక్రమేణా అది కర్నూలుగా మారిపోయింది. కందనవోలు కోటలో భాగమే ఈ కొండారెడ్డి బురుజు. ఈ కోటకు నాలుగు దిక్కులా నాలుగు బురుజులుండేవి. మిగిలిన మూడు బురుజులు కాలగర్భంలో కలిసిపోయాయి. పటిష్టంగా ఎంతో గంభీరంగా కనిపిస్తున్న కొండారెడ్డి బురుజును 15 లేదా 16 శతాబ్దాలలో (1529) విజయనగర రాజులు నిర్మించి ఉంటారని దీని నిర్మాణ శైలిని బట్టి తెలుస్తోంది. అయితే దీనిని ఎవరు ఎప్పుడు నిర్మించారనే దానికి కచ్చితమైన ఆధారాలు లేవు.

కొండారెడ్డి బురుజును గతంలో రాజులు కర్మాగారంగా ఉపయోగించినట్లు చరిత్రకారులు చెబుతారు. బందీలను ఇందులో ఉంచి శిక్షించే వారు. అదే రకంగా ఆంగ్లేయులు కొండారెడ్డి అనే ఒక స్వాతంత్ర్య సమరయోధుణ్ణి ఇందులో బంధించి, చిత్రహింసలకు గురి చేసి చంపివేశారు. ఆయన స్మారకంగా 'కందనవోలు' ప్రజలు దీనిని కొండారెడ్డి బురుజుగా పిలుస్తున్నారు.

గుండ్రని ఆకారంలో ఎంతో అందంగా ఈ బురుజు ఉంది. దీని వెనుక భాగాన గదులున్నాయి. పైకి సులువుగా ఎక్కడానికి మెట్లున్నాయి. అప్పట్లో శత్రువులను ఎదుర్కోవడానికి దీనిపైన రంధ్రాలు ఏర్పాటు చేశారు. ఈ రంధ్రాల గుండా తుపాకులతో శత్రువులను కాల్చేవారు. దీనిపై పహరా కాస్తున్న వారు కనుచూపు మేరలో ఉన్న శత్రువులను గుర్తించేవారు. శత్రు దుర్భేద్యంగా కందనవోలు కోటకు ముఖ ద్వారంగా ఈ బురుజు ఉంది. ఈ బురుజు నుండి అలంపురం క్షేత్రానికి సొరంగ మార్గం ఉంది. అయితే ప్రస్తుతం అది మూసివేయబడింది. బురుజు పై భాగంలో దృఢంగా విజయ స్తంభాన్ని నిర్మించారు. దీనిపై పతాకాలను ఎగురవేయడానికి ఒక కడ్డీ ఏర్పరిచారు. ఈ కడ్డీపైన కాకి కూర్చుని విజయస్తంభంపై నిల్చిన వర్షం నీటిని తాగితే కర్నూలుకు విఘాతం వస్తుందని ఒక మూఢనమ్మకం ఉంది. అయితే అది జరగనిపని. ఎందుకంటే కడ్డీపై నుండి విజయ స్తంభం పై భాగానికి దాదాపు మూడు అడుగుల వ్యత్యాసం ఉంది. కందనవోలును (కర్నూలు) నందవంశరాజులు, మౌర్యులు, పల్లవులు, శాతవాహనులు, చోళులు, విజయనగర రాజులు, బీజాపూర్ సుల్తానులు, మొగలులు, నిజాం నవాబులు, ఆంగ్లేయులు పాలించారు.

ఇక మరో గమ్మత్తయిన విషయమేమిటంటే కర్నూలులోని కొండారెడ్డి బురుజు వద్ద తీసిన సినిమా విజయవంతమవుతుందని సినీ నిర్మాతలు, డైరెక్టర్లలో నమ్మకం పెరిగిపోయింది. 1996లో ప్రేమించుకుందాంరా! అనే చిత్రాన్ని మొట్టమొదట ఈ బురుజు వద్ద తీశారు. ఫ్యాక్షన్ నేపథ్యం, ప్రేమ ఉన్న ఆ సినిమా విజయవంతమయింది. తరువాత సమరసింహారెడ్డి, ఆది చిత్రాలు ఇక్కడే తీశారు. ఇవి కూడా అఖండ విజయాన్ని సాధించాయి. దీనితో నిర్మాతల్లో ఒక సెంటిమెంట్ వచ్చేసింది. కొండారెడ్డి బురువు వద్ద తీసిన ప్రతి సినిమా హిట్ అవుతుందని వారిలో నమ్మకం పెరిగిపోయింది. ఆ పరంపరలో తర్వాత చెన్నకేశవరెడ్డి, సీమసింహం, ఒక్కడు, సీతయ్య మొదలు చిత్రాలు ఇక్కడ తీశారు. ఇలా ఇక్కడ తీసిన చిత్రాలన్నీ విజయపథంలో నడుస్తుండడంతో కనీసం ఒక్క షాటైనా ఇక్కడ తీయాలని ఉబలాట పడుతున్నారు. అంతేకాక ఆంధ్రదేశంలో కెల్లా ఎక్కువ శైవ క్షేత్రాలు ఈ జిల్లాలో ఉండటం చేతను, షూటింగ్‌కు అనుకూలమైన నల్లమల అడవులు, గ్రానైట్ కొండలు ఉండటం చేతను ఇక్కడకు రావడానికి ఉత్సాహపడుతున్నారు. నేడు సినిమాలలో రాయలసీమ ప్రాంతానికి చిహ్నంగా ఈ కొండారెడ్డి బురుజును వాడుకుంటున్నారు

ఎంతో అందంగా, విశాలంగా ఉన్న ఈ బురుజుపై సాయంకాలం సమయంలో సేద తీరడానికి అనుకూలంగా ఉంది. చిన్నపిల్లలు, స్కూలుపిల్లలు, కాలేజీ కుర్రవాళ్ళు సాయం సమయాల్లో దీనిపైకెక్కి ఆనందిస్తుంటారు. యావత్ కర్నూలు నగరాన్ని, నగర పరిసరాల్ని ఇక్కడి నుండి చూడవచ్చు. అంతేకాక దీని పక్కనే ఎంతో అందంగా వున్న 'చర్చి'ని కూడా చూడవచ్చు. దేశంలోకెల్లా అతి పెద్ద గోల్‌గుంబజ్ ఇక్కడ ఉండడం విశేషం. ◆



కర్నూల్‌లోని చర్చి

✻ మెండా రామకృష్ణ

పండుగ కాకపోయినా పండుగ వాతావరణం... హేమాహేమీల కలయికతో విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య అంతర్జాతీయ ఇండోర్ స్టేడియం ప్రముఖ చెస్ ఆటగాళ్లతో నాలుగు రోజులపాటు కళకళలాడింది. ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎత్తుకు పై ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తు చేసే సమగ చదరంగం 27వ జాతీయ టీమ్ చెస్ ఛాంపియన్ షిప్‌కు ఇది వేదికగా మారింది. గత నెల 25 నుండి 28వ తేదీ వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరుచుకున్న పలువురు భారత చెస్ తారలతో పోటీలు అంగరంగ వైభవంగా జరిగాయి. హేమాహేమీలు తలపడిన ఈ పోటీలు ఔత్సాహిక క్రీడాకారులకు ఒక చక్కటి అవకాశమని చెప్పవచ్చు. కోచ్‌ల చొరవ, ప్రభుత్వ ప్రోత్సాహం, స్పాన్సరర్ల మద్దతు వెరసి చెస్ ఆటగాళ్లు ఉన్నత స్థానం అధిరోహించడానికి మంచి అవకాశం ఏర్పడింది. అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండించడంతో పాటు రాబోయే తరానికి ఆదర్శప్రాయులుగా మారిన పలువురు చదరంగపు ధ్రువతారలను 'ప్రజాశక్తి క్రీడా విలేకరి' కలిశారు. ఈ సందర్భంగా చెస్‌పై వారు వెలిబుచ్చిన అభిప్రాయాలను వారి మాటల్లోనే...

ప్రపంచానికే మెరికలు ఈ చెస్ తారలు

ఎక్కువ టోర్నమెంట్లలో పాల్గొనాలి

మహిళా గ్రాండ్ మాస్టర్ విజయలక్ష్మి

ఎక్కువ టోర్నమెంట్‌లలో పాల్గొనడం ద్వారా చక్కటి అనుభవం లభిస్తుంది. ఇప్పుడున్నన్ని అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్లు గతంలో ఉండేవికావు. నేడు చాలా మంది స్పాన్సర్లు ముందుకు రావడం, ప్రభుత్వ ప్రోత్సాహం క్రీడాకారులకు వరంగా మారింది. ప్రైజ్ మనీ ఎక్కువగా ఉండటం వల్ల అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ మంది క్రీడాకారులతో తలపడే అవకాశం ఇటువంటి టోర్నమెంట్ల ద్వారా లభిస్తుంది. ఇలాంటి అనుభవాలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి తీసుకువెళతాయనడంలో సందేహం లేదు.

సాధనతోనే చక్కటి ఫలితం

సాధన చేస్తూ పదం కలిపితే సాధించలేనిదేముంది...? సాధనతోనే విజయం ముడిపడింది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న క్రీడాకారులందరి బహిరంగ రహస్యం ఇదే. ఈ సూత్రం క్రీడలతో పాటు అన్ని రంగాలకూ వర్తిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలి. మానసిక ఉత్తేజాన్ని కలిగించే గుణం కలిగిన చెస్ ఆటను నేర్చుకుంటే విద్యార్థుల్లో చదువుపై కూడా చురుకుదనం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా కారులకు చక్కటి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. రాష్ట్ర క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంది.



గ్రాండ్ మాస్టర్ అభిజిత్ కుంటే

ఆంధ్రాలో మంచి ప్రోత్సాహం ఉంది

గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ థిప్సే

చెస్‌కు ఆంధ్రాలో మంచి ప్రోత్సాహం ఉంది. క్రీడాకారులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కుని చక్కటి ఫలితాలు సాధించాలి. నేడు ఆంధ్రా క్రీడాకారుల్లో ఎక్కువ మంది అంతర్జాతీయ స్థాయిలో తిరుగులేని విజయాలు సాధించడానికి వారి సొంత కృషితో పాటు ప్రభుత్వ ప్రోత్సాహమే ప్రధాన కారణం. ఇతర క్రీడల మాదిరిగా చదరంగంలో సునాయాసంగా గెలుపొందడం సాధ్యంకాదు. ప్రణాళికాబద్ధమైన కృషి, క్రమశిక్షణ ఉంటేనే విజయం వరిస్తుంది.

విశ్వనాథన్ ఆనంద్ ఆదర్శం

పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు తరపున ఈ పోటీల్లో పాల్గొని జట్టుకు మంచి ఉత్సాహాన్ని అందజేశాను. నాకు విశ్వనాథన్ ఆనంద్ ఆదర్శం. నేను విజయం సాధించిన మ్యాచ్‌లలో విశ్వనాథన్ ఆనంద్ ఆటతీరు ఆధారంగా చేసుకుని ఆడినవే ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా చెస్‌లో విజయం సాధించాలంటే సాధనతో పాటు ఉత్సాహం అవసరం. చిన్ననాటి నుండి చెస్ అంటే అమితంగా ఇష్టపడేవాడిని. నాకు శిక్షణ ఇవ్వడం కోసమే మా నాన్న ఉద్యోగ విరమణ కూడా త్వరగా చేశారు. ప్రతిరోజూ కనీసం 10 గంటలు, టోర్నీలు జరుగుతున్నప్పుడు 3 గంటలు ప్రాక్టీస్ చేస్తాను. విజయవాడలో జరిగిన చెస్ పోటీలు నాకు ఎంతో సంతృప్తిని కలిగించాయి. పలువురు ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్ల కలయిక పండుగ వాతావరణాన్ని తలపించింది.

గ్రాండ్ మాస్టర్ కె.శశికిరణ్

కథ

* కండ్లకుంట శరత్ చంద్ర

ప్రవాహం

అంధకారబంధురాలైన... పర్వతపు గుహల్లో... ఈ కల్లోలిత లోకాన్ని చూసి ఏ మహర్షులు కార్చే కన్నీరో... లేక... మా'వన'జాతి హింసాత్మక ధోరణులకు భయపడి భూమాత ఎదలోనుండి కార్చిన చెమటో... సన్నని వాలుగా బయల్దేరి... క్రమంగా... ఉధృతమవుతూ... ఏళ్ళతరబడి ఏపుగా పెరిగిన మహావృక్షాలను కూకటి వేళ్ళతో పెకిలించుకుంటూ... మట్టిదిబ్బలను కోసేస్తూ... కొండల్ని చీల్చేస్తూ... బండరాళ్ళను తోసేస్తూ... వెనుదిరిగి చూడకుండా... మారథాన్ ఇన్నింగ్సును ఆరంభించింది 'ప్రవాహం!'

కాలగమనంలో ప్రవాహాలు కొండల్ని చీలుస్తాయి!

కొన్ని అంతర్మథనాలు... గుండెల్ని చీలుస్తాయి!!

ఆలోచిస్తే అనంతం...! అంతటా... వేదాంతం!!

కొండను చీల్చుకుని ప్రవహిస్తున్న కృష్ణా ప్రవాహాన్ని చూస్తున్నాడు రాజేష్ ప్రసాద్. తెలంగాణా ప్రాంతాలలో... 'అన్న'లు అని ప్రత్యేకంగా పిలవబడే... నక్సలైట్లలో... అతను ఒకడు.

అతడి కుడిచేతిలో స్టెన్‌గన్... కడుపునిండా బుల్లెట్లు తిని నిద్రపోతోంది. ఎడమచేతితో చుట్టూ పడున్న రాళ్ళను తీసి ప్రవాహంలోనికి విసురుతున్నాడు. రాయి వెళ్ళి ప్రవాహాన్ని తాకడం మాత్రమే అగుపిస్తోంది. ఆ తర్వాత ఆ రాయి ప్రవాహంలో కలిసిపోయి... శరవేగంతో... ఎక్కడికో కొట్టుకుపోతోంది. ఆ ప్రవాహంలో... ఆ రాయి, ఇసుక రేణువులుగా మారి ప్రవాహంలో కొట్టుకుపోతూ... రూపం, ఉనికి కోల్పోతుంది.

అతడు మరో రాయిని విసరాలనుకున్నాడు... ఎందుకో... విసరబుద్ధి కాలేదు. అతడు ఆలోచిస్తున్నాడు. విప్లవం ఒక ప్రవాహం... అవినీతి కొండల్ని చీల్చగలిగే శక్తి దానికుంది. విప్లవకారుడు 'రాయి' లాంటివాడు. ఆ 'రాయి' విప్లవ ప్రవహంలో పడితే తనలాగే... రూపురేఖల్ని కోల్పోతుంది. అవే రాళ్ళు... ఒకదానితో ఒకటి కలిసిపోయి... ఆ విప్లవ ప్రవాహానికి ఆనకట్ట వేస్తే విప్లవం ద్వారా ఉత్పన్నమయ్యే 'శక్తి'తో ఎందరి జీవితాల్లోనో 'వెలుగు' నింపవచ్చు. ఎన్నో 'నిర్మాణాత్మక' పనులు చేయవచ్చు.

టక్‌టక్... టక్‌టక్... టక్‌టక్...

బూట్ల శబ్దం వినిపించడంతో ఆలోచనాదారాలు తెగాయి. వెనక్కి తలతిప్పి చూశాడు. తన దళం సభ్యులు ముగ్గురు అగుపించారు. వాళ్ళు దగ్గరికొచ్చారు. తమ మెడల్లో వేలాడుతున్న తుపాకులను తీసి నేలపై ఉంచి కూర్చున్నారు. "రాజేష్! ఈ మధ్య నువ్వు ఒంటరిగా ఉంటున్నావ్.. ఎనీ... ప్రాబ్లమ్!" అడిగాడు నర్సింగ్..

ఏమిలేదన్నట్లు తలూపాడు రాజేష్ ప్రసాద్..

"రాజేష్! నిన్ను ఇలా ఒంటరిగా వదిలేయవద్దని... కమాండర్ ఆర్డర్! నీకు తెలియనిదేముంది చెప్పు... ఈ మధ్య పోలీసుల కూంబింగ్ ఆపరేషన్లు ఎక్కువయ్యాయి. ఒంటరిగా ఉండడం అస్సలు మంచిది కాదు" అంది శ్రీలక్ష్మి.

రాజేష్ ప్రసాద్ యోగిలా నవ్వి, "శ్రీలక్ష్మక్కా! ఒంటరిగా వున్నా.. దళంగా కలిసున్నా మనం సాధించేదేం లేదు" అన్నాడు.

ముగ్గురూ మొహమొహాలు చూసుకున్నారు. ఆ తర్వాత, పవన్ అన్నాడు. "రాజేష్..! మనం... ఏం సాధించామా అని అడుగుతున్నారా...! మనమిప్పటికే చాలా సాధించాం.. ఇంకా సాధించాలి!'

రాజేష్ నవ్వి, "ఏమిటి మనం సాధించింది. వివిధ ఎన్‌కౌంటర్లలో 45 మంది పోలీసులను చంపాను. ఎనిమిది ఇళ్ళ లూటీలలో పాల్గొన్నాను. 18 మంది పాతరలు అమర్చడంలో కృషి చేశాను. 14 బస్సులు తగులబెట్టాను. రెండు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు ధ్వంసం చేశాను. ఇలా చెప్తూపోతే... నా స్టాటిస్టికల్ రికార్డ్స్ చాలా వున్నాయి. కానీ ఏ ఒక్కటీ... నిర్మాణాత్మకంగా లేదు... అన్నీ... విధ్వంసాలే! ఏ ఒక్కటీ... ప్రజల మెప్పును పొందలేదు. ఇదేగా... మనం సాధించింది" అన్నాడు.

అతని ధోరణికి ఆ ముగ్గురూ విస్తుపోయారు.

మళ్ళీ రాజేష్ అన్నాడు. "'20,000 పరుగులు చేసిన తొలి ఆటగాడిగా, వన్డేలలో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా... అద్భుతమైన స్టాటిస్టికల్ రికార్డ్స్ కలిగి వున్న సచిన్ టెండూల్కర్... కనీసం వినోదం ద్వారానైనా ప్రజల అభిమానాన్ని పొందాడు. ఇప్పటివరకూ దక్షిణ భారతీయ చలన చిత్రరంగంలో... అత్యధికంగా... 123 సెంటర్లలో శతదినోత్సవాన్ని నమోదు చేసిన 'ఇంద్ర' సినిమాలో హీరోగా నటించిన మెగాస్టార్ చిరంజీవి... నటుడిగా విజయకేతనాలు ఎగరేశాడు. ఆయనా... వినోదాన్ని అందిస్తున్నవాడే! ఆయన కోసం ప్రాణాలిచ్చే అభిమానులు కోకొల్లలు. కారణం! వీరంతా... తమ కర్తవ్యాన్ని అద్భుతంగా నిర్వర్తిస్తున్నారు. కానీ... మనం హింసను ఆశ్రయించాం.

అసలు... మనం సాధించిందేమిటి! ఉన్నత ఆశయాలతో ప్రారంభమైన మన నక్సలిజం అడ్డదార్లు తొక్కుతూ... గతుకుల రోడ్ల వెంట పయనించి... చివరకు ముళ్ళబాటలో కుంటుతోంది. కారణం! జనాలకు... మనమీద 'అభిమానం' లేదు. అసలు మన పనుల పట్ల వారికి 'నమ్మకం' వుంటేగా... మనమీద 'అభిమానం' పెరగడానికి! ఇక్కడ నేను మాట్లాడుతోంది... 'ఇమేజ్'ల గురించి కాదు. కనీస 'తృప్తి' గురించి. ప్రజలు మన పనుల వల్ల కాస్త కూడా 'తృప్తి' పడడం లేదు. లోపం! సిద్ధాంతాల్లో లోపం లేదు. లోపం... మనలో వుంది.

సమసమాజం అంటూ మొదలెట్టిన మనం బస్సులూ, రైళ్ళూ తగలబెడుతున్నాం. దీనివల్ల నష్టపోయేది ఎవరు..! ప్రజలే...! నిశ్చయంగా ప్రజలే! ప్రభుత్వ ఆస్తుల్ని మనం ధ్వంసం చేస్తున్నప్పటికీ... ప్రభుత్వం పెద్దగా స్పందించదు. కారణం! ఆ నష్టాన్ని... పన్నులు, ధరల పెంపు రూపాలలో... ప్రజల నుండే పిండుతుంది. ఇవన్నీ.. మనం ఆలోచించం. ఆలోచించినా.. మిగిలిన 'దళ' సభ్యులు ఏమనుకుంటారోనని మన భావాల్ని వెల్లడించకుండా... మనసు పొరల్లో అదిమిపెట్టి...

ఆత్మవంచన చేసుకుంటూ... సాగిపోతున్నాం... ప్రవాహంలోని రాళ్ళలాగా... సాగుతూనే వుంటాం... మన ఆశయాలు నెరవేర్చకుండానే... ఇసుక రేణువులైపోతాం... నిర్మాణాత్మకంగా ఆలోచించనంతవరకూ... మనగతి ఇంతే!"

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. ఆ తర్వాత శ్రీలక్ష్మి అంది. 'నువ్వన్నది నిజమే తమ్ముడూ..! సత్యం ఎప్పుడూ ధర్మానికి అండగా నిలుస్తుంది. దీన్ని అర్థం చేసుకోవడం చాలా సింపుల్. చిరంజీవి కోసం ప్రాణాలిస్తారు. ఆయన బాధపడితే.. కొన్ని లక్షల మంది అభిమానులు బాధపడతారు. కారణం... ఆయన 'బ్లడ్‌బ్యాంకు' నడుపుతూ... రక్తాన్నిచ్చి ప్రాణాల్ని నిలబెడుతున్నాడు. మనం చచ్చినా... ఈ ప్రజలెవరూ.. ఏడవరు సరికదా! అస్సలు పట్టించుకోరు. కారణం... మనం మనుషుల రక్తాన్ని భూమిపై పారిస్తున్నాం. ప్రాణాలు తీస్తున్నాం. చిన్నతేడా...! ఒకే ఒక్క తేడా...! రక్తదానం...! రక్తహరణం...!"

నర్సింగ్ మనుసులో అనుకున్నాడు. 'నిజమే! దినపత్రిక మొదటి పేజీలో వచ్చిన నక్సలైట్ల చావు వార్తలను గూర్చి లైట్‌గా తీసుకొని, డైరెక్ట్‌గా... 'సినిమా' పేజీలో వచ్చిన అభిమాన నటుల ఫోజులు చూడడానికి, క్రీడా పేజీలోనికి.. తొంగిచూసే వారే అత్యధికం! కారణం... ఈ 'హింస', 'చావడం', 'చంపడం'... మా... మూ...లే...! అనుకుంటోంది... ప్రజ!'

అయినప్పటికీ నర్సింగ్ బయటపడలేదు. కారణం... దళానికి అతడే ఉపకమాండర్. "రాజేష్! ఇక ఆలోచించింది చాల్లే...! అనవసరంగా... బుర్రపాడుచేసుకోకు. పద! కమాండర్ ఆర్డర్స్ అమలు చేయాలి" అన్నాడు నర్సింగ్.

"ఏం చేయాలి?" అడిగాడు పవన్.

"శివాజీపల్లిలో భార్గవ్ అనే ఓ పోలీసు ఇన్‌ఫార్మర్ ఉన్నాడని తెలిసింది. వాడి కాళ్ళు నరికేయాలి. ఆ తర్వాత మద్దికోన కల్వర్టు కింద మందుపాతర ఫిక్స్ చేయాలి" చెప్పాడు నర్సింగ్.

"మందుపాతరా...! ఎందుకు?" అన్నాడు రాజేష్.

"రేపు సాయంత్రం ఈ దారిలో హోంమినిస్టరు వెలుతున్నాడు" చెప్పింది శ్రీలక్ష్మి. రాజేష్ ప్రసాద్ నిట్టూర్చాడు.

* * *

ప్రవాహాన్ని అడ్డుకోవడం... మామూలుగా అయితే సాధ్యం కాదు.

మరి ఏం చెయ్యాలి!!

ప్రవాహాన్ని చూస్తూ కూర్చున్నాడు అశోక్!

'రక్షక భటులు' అనే పేరుతో పిలవబడుతూ... జనాలపై దాదాగిరి చెలాయించే... కొందరు భక్షక భటులలో... తనూ ఒకడు. పోలీస్ కానిస్టేబుల్! అతడు... ఆలోచిస్తున్నాడు.

అవినీతి ఒక ప్రవాహం లాంటిది. దాన్ని అడ్డుకోవడం... అంత సులభం కాదు. ఆ... ప్రవాహంలో పడితే... బయటికి రావడం దాదాపు అసాధ్యం. మరి... తనెందుకు అందులో దిగాడు.

అవినీతిపరుల కొమ్ముకాస్తూ, వాళ్ళ మోచేతి నీళ్ళు తాగుతూ బతికే వర్గానికి చెందిన పోలీసులలో... తనూ ఎందుకు కలిసిపోయాడు.

ప్రజలు తమను చూసి భయపడతారు.

కూరగాయల వాళ్ళు, పాలవాళ్ళ దగ్గరి నుండీ... అందరూ తమకు 'భయపడి' మామూళ్ళు ఇస్తారు. ఎన్‌కౌంటర్లలో నక్సలైట్లను చంపితే... పతకాలూ, ఇంక్రిమెంట్లు! నక్సలైట్లకు ఇన్‌ఫార్మర్లుగా పనిచేసే వారిని వేధించడానికే తమకు టైం సరిపోవడం లేదు. ఇక శాంతిభద్రతల గురించి ఎలా పట్టించుకుంటారు.

"ఏంటయ్యా అశోక్...! ఇక్కడ కూర్చున్నావేం?"

అశోక్ తలతిప్పి చూశాడు. ఎస్సై మల్లికార్జున్! జాగింగ్ చేయడం అతని దినచర్యలో భాగం.

"గుడ్మార్నింగ్ సార్!"

"ఊ! గుడ్మానింగ్! నేను అడిగిందానికి సమాధానం చెప్పలేదు..." అన్నాడు ఎస్సై కూర్చుంటూ.

"చెప్పడానికేముంది సార్! మనసేం బాలేదు" అన్నాడు అశోక్ విచార వదనంతో "ఏంటయ్యో..! కొత్తగా మాట్లాడుతున్నావు. అసలు...సమస్యేంటి!"

"ఏంలేద్సార్! మనం... అవినీతి పరులకు అనుచరులుగా వుంటూ... వాళ్ళు విసిరేసే... డబ్బుల కోసం... చట్టాన్ని వాళ్ళ కాళ్ళ ముందు పడేశాం... ఇదే నన్ను బాధిస్తోంది సార్! ఇన్నాళ్ళ నుండీ లేనిది... ఇప్పుడు జ్ఞానోదయం కలిగిందేమిటని అడగకండి. ఎందుకో! నా మనసు... పదేపదే... మనం చేస్తున్న అన్యాయాల్ని గుర్తు

చేస్తోంది." అన్నాడు అశోక్.

మల్లికార్జున్ నవ్వి, "కొంపదీసి... స్వామీజీలు చెప్పే ఉపన్యాసాలేమైనా విన్నావా! లేకపోతే.... సువార్త మహాసభలకు వెళ్ళావా! నైతిక విలువల గురించి తెగ ఆలోచిస్తున్నట్లున్నావ్!

అశోక్! ప్రాక్టికల్‌గా ఆలోచించు. నైతిక విలువల్ని నమ్ముకుంటే... ఒరిగేదేం లేదు. నైతిక విలువల్ని నమ్ముకుని వుంటే... నీకొచ్చే జీతంతో... నీ భార్య ఒంటినిండా నగలు చేయించగలిగేవాడివా! నీ చెల్లెల్ని మంచి కాలేజీలో చేర్పించగలిగేవాడివా! నీ తమ్ముడ్ని ఎంసెట్ కోచింగ్‌కు పంపగలిగేవాడివా!

నైతిక విలువల్ని వదిలేశావు కాబట్టే.. ఇవన్నీ చెయ్యగలిగావు..." అన్నాడు.

"సార్..! మరి... ఈ అవినీతికి అంతం లేదా!"

"ఉండదు. ఉండకూడదు. ఎందుకో. తెలుసా! అవినీతి పరులుంటేనే... మనం మరింత బాగా జీవించగలం. భూస్వామి వీరారెడ్డి కొడుకు అనిల్ రెడ్డి.. ఆరుగురు స్త్రీలపై అత్యాచారం చేశాడు. బాధితులు కేసులు పెట్టారు. వాటిని తారుమారు చేసి, కనీసం కోర్టు దాకా కూడా వెళ్ళకుండా చేయగలిగాం. ఆ కేసులలో మనకు లక్ష రూపాయల దాకా ముట్టాయి. నాగరాజు దుకాణంలో కల్తీ సరుకులు అమ్ముతాడు. అది యధేచ్ఛగా సాగేందుకు మనకు ప్రతినెలా పదివేలు ఇస్తాడు. ప్రతిరోజూ మన ఊరినుండి వెళ్ళే ప్రైవేట్ వాహనాలు 68. వాళ్ళందరూ నెలనెలా ఇచ్చే మామూళ్ళు... మొత్తం పాతికవేలు! ఇలా... మనం ప్రతినెలా మన జీతానికి పదిరెట్ల డబ్బు ఎక్కువగా సంపాదిస్తున్నాం.

'అవినీతి' అనేది లేకపోతే... మనం లాభపడతామా చెప్పు. నో! అవినీతి ఉండాలి. దీపం ఉన్నప్పుడే.. మనం, ఇల్లు చక్కబెట్టుకోవాలి. అనవసరమైన విషయాలు ఆలోచించి బుర్రపాడు చేసుకోకు..." వివరించాడు మల్లికార్జున్.

అశోక్ మౌనం వహించాడు.

"అశోక్! పద! ఇలా ఒంటరిగా కూర్చోకు. ఈ మధ్య నక్సలైట్లు పోలీసులను కిడ్నాప్ చేస్తున్నారు. ఈ రోజు సాయంత్రం హోంమినిస్టరు ఈ రూట్లో వెళ్తాడు. మన స్టేషన్‌కు వచ్చినా రావొచ్చు. అందరూ కలిసి స్టేషన్‌ను డెకరేట్ చెయ్యండి" చెప్పి లేచాడు మల్లికార్జున్.

* * *

నక్సలైట్లు కల్వర్ట్ దగ్గరమందు పాతర అమరుస్తున్నారు.

"ఛీఛీ! ఈ నెత్తుటి వర్షంతో... సమసమాజం స్థాపిస్తారా!' ఎవరో చెవిలో అరిచినట్లనిపించింది రాజేష్ ప్రసాద్‌కు.

తలవిదిలించి పని చేసుకుపోసాగాడు.

'పోలీసులు ఏం పాపం చేశారు. పొట్టకూటి కోసం ఉద్యోగం చేస్తున్నారు. తమ అధికారుల ఆజ్ఞల్ని పాటిస్తున్నారు. అంతమాత్రం చేత పోలీసులను చంపడం... ఎంతవరకు న్యాయం. రెక్కాడితే గానీ డొక్కాడని ఈ గూడెం ప్రజలు... వందరూపాయల నోటు చూసేసరికి... తమ అవసరం కోసం.. నక్సలైట్ల ఉనికిని చెప్తున్నారు. వాస్తవంగా ఆలోచిస్తే.. అందులో తప్పేముంది! అవసరం... వారిని ఆ పని చేయిస్తోంది. తమ అవసరాల (?) కోసం ప్రజల్ని పీల్చి పిప్పిచేసే రాజకీయ నాయకుల కంటే... వీళ్ళు చేసేది తక్కువ హానే కదా! మరి... ఆ ప్రజల్ని ఎందుకు చంపుతున్నారు?!!'.

చెవి దగ్గర రొద ఎక్కువయ్యింది. 'ఊ! బయటికిరా....! ప్రజల్లో కలువు...! బహిరంగంగా... పోరాడు.

రాజేష్ ప్రసాద్ కళ్ళు తిరుగుతున్నాయి.

* * *

పోలీస్‌స్టేషన్లో శుభ్రంగా ఊడ్చి, కడిగే కార్యక్రమం జరుగుతోంది.

లాకప్‌లో ఇద్దరు నక్సలైట్లు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

అశోక్ వారివైపే చూస్తున్నాడు.

'అశోక్! జాగ్రత్తగా ఆలోచించు. నైతిక విలువల గురించి ఆలోచించు. ఆ నక్సలైట్లు ఏం తప్పు చేస్తున్నారు? ప్రజల రక్తాన్ని పీల్చి... ఆస్తుల్ని కూడబెట్టిన వీరారెడ్డి లాంటి వాళ్ళను బెదిరించి, వారి ధనాన్ని దోచుకు వెళ్ళి... పేద ప్రజలకు పంచుతున్నారు. అవినీతి ప్రవాహాన్ని ఆపడం కోసం 'విప్లవం' అనే గోడను కడుతున్నారు. నువ్వూ.. ఉన్నావ్! ఎందుకూ..! నీ కుటుంబాన్ని అభివృద్ధి చేయడం కోసం... అవినీతి పరులకు సలాం చేస్తున్నావ్... ఏ.సి.గదులలో పడుకోవడం కోసం... అవినీతిని పెంచడంలో సహాయం చేస్తున్నావ్. మరి నక్సలైట్లు! అవినీతిని నిర్మూలించే దిశలో... ఎండనూ వాననూ లెక్కచేయకుండా.. అడవుల్లో పడుకుంటున్నారు' మనసు చెప్పింది.

'మరి... నేనేం చెయ్యాలి?' ప్రశ్నించుకున్నాడు అశోక్.

ఊ...! బయటికిరా! అవినీతిలో నుండి... బయటికి వచ్చి... విప్లవం వైపు నడువు. విప్లవకారులతో చేయి కలుపు! ప్రజల కోసం పోరాడు!"

చెవిలో ప్రతిధ్వనిస్తోంది.

అశోక్ మెదడు మొద్దుబారిపోయింది. ◆

భారతీయ స్త్రీ-స్త్రీవాదం ఒక పరిశీలన

కులంలో, మత వ్యవస్థలో, సామాజిక జీవనంలో, కుటుంబ వ్యవస్థలో, స్త్రీ, పురుష సంబంధాల్లో పితృస్వామ్యత తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ వుంది. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, ధర్మశాస్త్రాలు, పురాణాలలో ఈ పురుషాధిక్య భావాన్నే చిత్రిస్తూ, వర్ణిస్తూ, పితృస్వామ్యానికి పీడితులైన స్త్రీల చేత కూడా పితృస్వామ్యాన్ని చెప్పిస్తూ వచ్చారు.

మతాలన్నీ పితృస్వామిక సామాజిక వ్యవస్థనే ప్రోత్సహించాయి. స్త్రీలు పురుషుల అధీనంలో ఉండాలనీ, పురుషులు స్త్రీల రక్షణ బాధ్యతలు వహించాలనీ మతాలన్నీ ఘోషిస్తున్నాయి. పితృస్వామ్య వ్యవస్థలో సామాజిక జీవితంలోని ప్రతి అంశాన్ని పురుషుడు శాసిస్తుంటారు. రాజ్యం, దేవాలయం, కుటుంబం, ఆస్తి, ఉత్పత్తి మొదలైన అన్ని అంశాలపైన పురుషుడు ఆధిపత్యం కలిగి వుంటాడు. పునరుత్పత్తిపైన కూడా పురుషుడే ఆధిపత్యం వహిస్తాడు. పురుషుడి పేరు మీదనే తరువాత తరాలు అభివృద్ధి చెందుతాయి. ఈ భావాలు, లక్షణాలు కలిగిన పితృస్వామిక వ్యవస్థను హిందూ, క్రైస్తవ, ఇస్లాంతో పాటు అన్ని మతాలూ ప్రోత్సహించాయి.

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ
రచన : కత్తి పద్మారావు,
ప్రచురణ : లోకాయత ప్రచురణలు, పొన్నూరు
వెల : రు.100/-
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

అక్షర బద్ధమైన ఈతిశాస్త్రం మీద పురుష పెత్తనం కొనసాగింది. దీనికి మనస్తత్వ శాస్త్రం కూడా మినహాయింపు కాదు. పురుషుడు తన దృష్టితో స్త్రీని తూచి, విశ్లేషిస్తూ ఆమెను నిర్ధారించడంలో చూపిన అణచివేతలో భాగంగా ఫ్రాయిడ్‌ను విమర్శించిన విధానం మనల్ని ఆలోచింప చేస్తుంది.

మధ్యతరగతి స్త్రీకంటే ఎక్కువగా దళిత స్త్రీ ఈనాడు కులం, లింగం, అధికారంలో బలి అవుతున్నారు. ఆమె పితృస్వామ్య కులాధిపత్యంలో సామాజిక ఆర్థిక పీడనను ఎదుర్కొంటుందని 'దళిత స్త్రీలపై వివక్ష-దమనకాండ'లో తెలియజేశారు.

స్త్రీ బానిసత్వానికి, అస్పృశ్యతకు మూలకేంద్రమైన హిందూ మత వ్యవస్థ పునాదులు కూల్చకుండా పితృస్వామ్య వ్యవస్థ కేవలం ఉపరితల స్త్రీవాద ఉద్యమాల వల్ల నాశనం కాదంటూ హిందూ అగ్రవర్ణ స్త్రీవాద పరిమితులను వివరించిన విధానం బాగుంది.

ఈనాడు హిందూ వ్యవస్థ నుండి వచ్చిన స్త్రీవాదులు హిందూ జీవన విధానంలోనే ఉండి నామమాత్రమైన స్వేచ్ఛను కోరుతున్నారు. వారు వ్యవస్థను అలాగే వుంచి పట్టణాల్లో వస్తున్న మార్పులకనుగుణంగా కొన్ని సవరణలు కోరినంత మాత్రాన స్త్రీకి బానిసత్వ విముక్తి కలుగదు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న స్త్రీవాద ఉద్యమాల సిద్ధాంతాలను, పునాదిని, నిర్మాణాన్ని, వ్యక్తిత్వాన్ని భారత ఉపఖండంలో వస్తున్న స్త్రీవాద ఉద్యమాలు అందుకోవాలంటే అవి అణగదొక్కబడిన కులాల స్త్రీల నాయకత్వంలో వచ్చినపుడే సాధ్యమవుతుందని రచయిత తెలియజేస్తున్నారు. అలాంటి రోజుకోసం ఎదురుచూద్దాం.

రచయిత కష్టపడి పరిశోధించి సేకరించిన సమాచారాన్ని మరింత మెరుగైన క్రమ పద్ధతిలో (చాప్టరైజేషన్‌తో) ఇచ్చివుంటే బాగుండేది. రెఫరెన్స్‌లను యథాతథంగా ఇంగ్లీషులో ఇవ్వడం కంటే, వాటి తెలుగు అనువాదాలనే ఇచ్చివుంటే తెలుగు పాఠకుడికి కొంత శ్రమ తగ్గించినట్లయ్యేది. ఏదిఏమైనా ఇదివరకు వచ్చిన ఈ రకమైన పుస్తకాలన్నింటికంటే, ఈ పుస్తకాన్ని ప్రామాణికంగా రూపొందించిన కత్తి పద్మారావు కృషి ప్రశంసనీయం.

*** కె.పి.అశోక్ కుమార్**

స్వీకారం



అమ్మ జ్ఞాపకం
రచన: కర్రా కార్తికేయశర్మ, **వెల:** రు.25/-
ప్రతులకు: కర్రా కార్తికేయశర్మ, ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, గంగవరం (ఏజెన్సీ) తూ.గో.జిల్లా.

మనదేశంలో పూర్వం విమానాలుండేవా?
రచన: రావిపూడి వెంకటాద్రి, **వెల:** రు.25/-
ప్రతులకు: రావిపూడి వెంకటాద్రి, ఎడిటర్, హేతువాది, చీరాల

వెన్నెల పూలు
రచన: శాఖమూరి శ్రీనివాస్, **వెల:** రు.12/-
ప్రతులకు: శాఖమూరి శ్రీనివాస్, టీచర్, మం.ప్రా.పాఠశాల, నర్సాయపాలెం, ప్రకాశంజిల్లా.

* యు. రామకృష్ణ

అప్పటికి "గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు"లో నమోదైన 'ఈలపాట రికార్డు' 45 గంటల 20 నిమిషాలు. దీనిని గుంటూరుకు చెందిన ఆంధ్రా బ్యాంక్ ఉద్యోగి వంకా రవీంద్రనాథ్ స్థాపించారు. అదే ఊరికి చెందిన జూలూరు వెంకట హరిగోపాల్‌కు అనాటికి ఈలపాటలో కనీస ప్రవేశం కూడా లేదు. రవీంద్రనాథ్ ఈలపాట విన్నాక, ఆయన సాధించిన రికార్డ్ స్ఫూర్తితో, ఏమైనా సరే తానూ ఈలపాటలో ప్రవేశించి, పాత రికార్డును తిరగరాయాలనుకున్నాడు హరిగోపాల్. కఠోరంగా పరిశ్రమించి రెండేళ్ళలోనే పాత రికార్డును అధిగమించి కొత్త రికార్డును (49 గంటల 20 నిమిషాలు) తిరగరాసి గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించిన హరిగోపాల్ గురించి ఈవారం తెలుసుకుందాం.

నాటి ప.గో.జిల్లా కలెక్టర్ అజయ్ కల్లాంచే సత్కారం పొందుతున్న హరిగోపాల్

'ఈలపాట'కు ప్రోత్సాహం అవసరం

ఈలవేయడం కొందరి సరదా. ఈలవేసేవారంటే కొందరికి కోపం. ఈలవేసేవారిని పోకిరివారిగా, జులాయిలుగా కొందరు ముద్ర వేస్తుంటారు. దురదృష్టవశాత్తు 'ఈల'పై సమాజంలో కొంత చులకన భావం కూడా లేకపోలేదు. అయితే ఈలను పాటగా వినిపిస్తే మాత్రం అందరికీ ఇష్టమే. అందువల్లనే రఘురామయ్య ఈలపాట తెలుగువారిని పరవశింపచేసింది. ఈలకు స్వరాలు కూర్చి, రాగాలు ఆలపించిన సీతారామయ్య సుప్రసిద్ధులయ్యారు. ఈలపాట కచేరీలతోనే శివప్రసాద్ రాష్ట్రం నలుమూలలా ప్రజాదరణ పొందారు. అయితే జూలూరి వెంకట హరిగోపాల్ పాట దాకా వెళ్ళలేదు. ఈలవేసుకుంటూ గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కాలని తపన పడ్డారు. వంకా రవీంద్రనాథ్ ప్రేరణతో ఆయన రికార్డు (45గంటల 20నిమిషాలు)ను అధిగమించాలన్న పట్టుదలతో నిరంతరం శ్రమించి ముందు ఈలనూ, తర్వాత ఈలపాటనూ నేర్చుకొని రెండేళ్ళలో 'గత రికార్డు'ను అధిగమించి 'సరికొత్త రికార్డు'ను స్థాపించానని చెప్పారు హరిగోపాల్. గిన్నిస్ నిబంధనల మేరకు గంటకు ఐదు నిమిషాల సేపు విశ్రాంతి తీసుకుంటూ, నిద్రను వదిలి వరుసగా మూడురోజులపాటు (అంటే 49గంటల 20 నిమిషాలపాటు) ఏకధాటిగా ఈలపాటను ఆలపించానన్నారు. రెండేళ్ళ కిందట నాటి మెదక్‌జిల్లా కలెక్టర్ డి.ఆర్. గార్గ్ సమక్షంలో సంగారెడ్డి గెస్ట్‌హౌస్‌లో ఈలపాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించానని చెప్పారు.

కార్యక్రమ నిర్వాహకులైన మెదక్‌జిల్లా సమాచార - పౌర సంబంధాల శాఖ అధికారులూ, ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేసిన 'ఎన్‌సిఎల్' వారూ ఇంగ్లండ్‌లోని గిన్నిస్‌బుక్ అధికారులకు తన సమాచారం పంపించారన్నారు. దీనితో అక్కడివారు తనను అభినందిస్తూ టెలిగ్రాం పంపారని, అంతేగాక గిన్నిస్‌బుక్‌లో నమోదు చేయడానికి సంబంధిత వివరాలు పంపమని కోరారన్నారు. ఆ విధంగా తాను ఈలపాటలో మునుపటి ప్రపంచ రికార్డును అధిగమించడం ద్వారా సరికొత్తగా గిన్నిస్‌బుక్‌లోకెక్కానన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనేందుకు గతంలో 'తానా' నుండి తనకు ఆహ్వానం కూడా అందిందని, అయితే అనివార్య కారణాల వల్ల వాటికి హాజరుకాలేకపోయానన్నారు. ఈలపాటను కేవలం రికార్డు సాధించడానికి మాత్రమే ప్రాక్టీసు చేశానన్నారు. ఈ కళపై ఆధారపడి రాష్ట్రంలో ఎవ్వరూ ముందుకు సాగడం లేదని, ఉన్న అవకాశాలు కూడా కొద్దిమందికే చేరుతున్నాయని, ఇది దురదృష్టకర పరిణామమని అన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం పలుకుబడి వున్నవారికే చేరుతోందని, అవార్డులూ రివార్డులూ ఇచ్చేవారు కూడా ఈ వ్యక్తి మనకు ఎంతవరకూ ఉపయోగపడతాడు, ఈ వ్యక్తికి చేయూతనిస్తే మనకేమిటి లాభం అనే విషయాలపై దృష్టి పెడుతున్నారని హరిగోపాల్ ఆవేదనగా చెప్పారు. రికార్డులు సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతిలో కార్యక్రమం ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటోందని అన్నారు. ప్రోత్సాహం ఇవ్వాలనుకుంటే ఎంతైనా ఇవ్వవచ్చని అన్నారు. ప్రోత్సాహం లేని ఎందరో యువ కళాకారులు నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.

ఆస్ట్రేలియా నుండి భారత్ సందర్శనార్థం వచ్చిన ఇద్దరు టూరిస్టులు హైదరాబాద్ చేరుకున్న తరువాత తన ప్రపంచ రికార్డు తెలుసుకొని వారు తనను అభినందించిన తీరు తనకు మరచిపోలేని సంఘటన అన్నారు. ఇలాంటి రికార్డు సాధించిన వారికి ఆస్ట్రేలియాలో ప్రభుత్వపరంగా ఎంతో ప్రోత్సాహం వుంటుందని చెప్పారని హరిగోపాల్ తెలిపారు. ప్రస్తుతం ప్రజాశక్తి దినపత్రిక(గుంటూరు సబ్ సెంటర్)లో సబ్‌ఎడిటర్‌గా పనిచేస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన ఈ యువకళాకారుడు భవిష్యత్‌లో మరిన్ని రికార్డులు బద్దలు చేయాలనే తలంపుతో పయనించడం ముదావహం.

నాటి రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు

ఈలపాటలో నూతన ప్రపంచ రికార్డును స్థాపించిన హరిగోపాల్‌ను నాటి రాష్ట్రపతి శంకర దయాళ్‌శర్మ, అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు అభినందించారు. మన దేశ యువత ప్రపంచ దేశాల్లోని ఏ దేశ యువతకూ తీసిపోరనే నిజాన్ని నిరూపించిన గోపాల్‌కు అభినందనలు అంటూ శంకర్ దయాళ్‌శర్మ లేఖ పంపారు. ఉన్నత లక్ష్యాలవైపు గురిపెడుతున్న యువతకు మీరు నెలకొల్పిన రికార్డు ఒక స్ఫూర్తి అవుతుందని పి.వి. నరసింహారావు ప్రశంసించారు. నాటి పశ్చిమగోదావరిజిల్లా కలెక్టర్ అజయ్ కల్లాం, నాటి మెదక్‌జిల్లా కలెక్టర్ జి.ఆర్. గార్గ్ తదితరులు ఘనంగా సన్మానించారు. ◆



ఫ్యాషన్ 'షో'కులపై మక్కువెందుకు?

జర్నలిస్టు సాయినాథ్

ఆరణాల అచ్చ తెలుగు వాడైన పాలగుమ్మి సాయినాథ్ రెండంచుల పదునున్న ఖడ్గం. ఆయన రాతలెంత పదునుగా ఉంటాయో, మాటల్లో అంత సమ్మోహనా శక్తి ఉంటుంది. ఏ విషయాన్నయినా సూటిగా చెబుతారు. వాస్తవాలు వెలికి తీసేవరకూ నిరంతరం శ్రమిస్తారు. సమకాలీన పాత్రికేయులకు ఆయన స్ఫూర్తి. సాయినాథ్ రాసిన 'ఎవ్రిబడి లవ్స్ ఏ గుడ్ డ్రాట్' పుస్తకం పాత్రికేయుల చేతుల్లోనేకాదు, దేశంలోని అధికారుల అరల్లోనూ చోటుచేసుకుంది. మోటూరు హనుమంతరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం చేసేందుకు 'ప్రజాశక్తి' ఆహ్వానంపై హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏమంటారో ఆయన మాటల్లోనే విందాం...

1983-84లో తొమ్మిది రాష్ట్రాల్లో కరువు. మేం టూర్ చేశాం. నాకు సంతృప్తినివ్వలేదు. రిపోర్టింగ్ అంటే చాలామంది అనుకోవచ్చు, ఆ ఏముంది... కలెక్టర్ దగ్గర కూర్చుంటే వివరాలిస్తాడు. దాన్ని రాసేయటమేకదా అని. కలెక్టర్ ఎవరండీ? మీకన్నా ఎక్కువ తెలుసా?... మహా అయితే కొన్ని నెలలు ముందు నుండి అక్కడ పనిచేస్తుండొచ్చు. ఆ జిల్లా గురించి అతనికేం తెలుసు. రైతునడగండి చెబుతాడు...

ఇప్పటి విలేకర్లు అనుసరిస్తున్న విధానం కరెక్టుకాదు. విలేకరులు తమ ఆలోచనా దృక్పథాన్ని మార్చుకోవాలి. ప్రభుత్వాలు తమ బాధ్యతల నుండి ఎలా తప్పించుకోచూస్తున్నాయో పాఠకులకు తెలియచెప్పే బాధ్యత విలేకర్లపై ఉంది. ఇప్పటి జర్నలిజం కళాశాలలు, అనుబంధ సంస్థల్లో బోధించేవారికి పుస్తకజ్ఞానం తప్ప ఫీల్డ్‌వర్క్‌లో అనుభవంలేదు. ఇదే ప్రధాన సమస్య. పత్రికల్లో పనిచేసేవారికి ఆయా సంస్థలు ఇస్తున్న శిక్షణ కొంతవరకు మేలుచేస్తోంది. అయితే యాజమాన్యాలు సాంకేతిక పరిజ్ఞానంపై చూపిస్తున్న మక్కువ వార్తా సేకరణపై చూపించకపోవడం దురదృష్టకరం. పైగా పత్రికలు ఫ్యాషన్ షోలు, మిస్ ఇండియా... వార్తలకిస్తున్న ప్రాధాన్యత మధ్య తరగతి, గ్రామీణ ప్రాంతవాసుల సమస్యలకు ఇవ్వట్లేదు. ఈ మధ్య లాక్మే ఫాషన్ షోకు మీడియా ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో తెలుసుగా. ఈ విధమైన మార్పు దశాబ్దం కిందట ఆరంభమైంది. పదేళ్ళ కిందట సెన్సెక్స్ 4000 క్రాసయితే పతాక శీర్షికలకెక్కింది. అదే పేజీలో అడుగునెక్కడో మహారాష్ట్రలో 29 మంది పిల్లల ఆకలిచావు అనే వార్తను సింగిల్ కాలంలో ఇచ్చారు.

విలేకర్లు వాస్తవాలను రాయాలి. అంతే తప్ప అద్దంలో చంద్రుణ్ణి చూపించకూడదు. ఆంధ్రప్రదేశ్‌లో మీరు గ్రామీణ ప్రాంతానికి వెళ్ళి ఎలా ఉన్నారని అడిగితే దేవుడి దయవల్ల బాగానే ఉన్నాం... అంటారు. అదే కేరళ రాష్ట్రం వెళ్ళి అడగండి ఎలా ఉన్నారని, అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శిస్తారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొన్ని పత్రికలు, మరికొన్ని ప్రభుత్వ రిపోర్టులు కేరళ గురించి తప్పుడు సమాచారం ఇచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను ఆకాశానికెత్తాయి. వాస్తవాలు వెలికి తీయాలంటే లోతుల్లోకి వెళ్ళాలి. స్థానికుల్ని కలవాలి, వాళ్ళతో చర్చపెట్టాలి. దీనికి ఓర్పు ఉండాలి. మధ్యప్రదేశ్‌లో జరిగిన సంఘటనే చూడండి. ఓ దళిత సర్పంచ్‌ని ఆగష్టు 15న జాతీయ జెండాను ఎగురవేయనీయకుండా అక్కడి పెత్తందారులు అడ్డుపడ్డారు. జాతీయ జెండాను ఆమె తాకితేనే మైలపడుతుందన్నారు. ఆ వార్త ఏ పత్రికా కవర్ చేయలేదు. ఓ దళిత సంఘం ఈసంఘటనపై ఖండన పంపిస్తే ఒక పత్రిక ఎక్కడో మూలన చిన్న ముక్క వేసింది. భోపాల్లోని ఒక ఐఎఎస్ అధికారి ద్వారా ఈ విషయం తెలిసింది. భోపాల్ నుండి బుందేల్ ఖండ్ వెళ్ళి, అక్కడి నుండి గ్రామంలో దళిత సర్పంచ్ అడ్రస్ కనుక్కోటానికే రెండురోజులు పట్టింది. వాస్తవాలు సేకరించి పత్రిక ద్వారా ఆమెకు జరిగిన అవమానాన్ని ప్రపంచానికి చాటితే, అసెంబ్లీలో ఈ వార్తను ప్రస్తావించారు. చివరకు ఏమైందో తెలుసా... ఎవరైతే దళిత సర్పంచ్‌ను అవమానించారో వారి ఎదుట జిల్లా కేంద్రంలో ఆమె జెండా ఎగరేశారు. అయితే రాసిన ప్రతివార్తకూ ప్రభుత్వం నుండి స్పందన వస్తుందనికాదు. వాస్తవాలను తెలియచెప్పటం విలేకర్ల కనీసబాధ్యత.

చరిత్ర గురించి ప్రస్తావిస్తూ...

చరిత్రంటే పురాణాలుకాదు, సోషియో ఎకనమిక్ హిస్టరీ చదివితే దాంట్లో వాస్తవం ఉంటుంది. తెలంగాణా సామాజిక పరిస్థితులు, అక్కడి ప్రజల గురించి రాయాలంటే నైజాం చరిత్ర తెలిసుండాలి. అంతేకానీ ఢిల్లీ, ముంబాయి నుండి మీడియాను తెప్పించి రెండు గంటల్లో స్టోరీచేస్తే ఆ అంశం వాస్తవాలను ప్రతిబింబించగలదా!.

చరిత్రకారుల, ఆర్థిక శాస్త్రవేత్తల పాత్రవేరు, విలేకరుల పాత్రవేరు. రొమిల్లా థాపర్, అమర్త్యసేన్ రాసిన అంశాలనే తీసుకోండి. అవి చాలా క్లిష్టంగా ఉంటాయి.

ఎక్కడా భేషజం ప్రదర్శించని వ్యక్తి సాయినాథ్. అయితే ఎవరైనా అధికారదర్పం ప్రదర్శిస్తే సహించరు. గతంలో తెలుగు దేశం పార్టీ వారు సాయినాథ్ బుక్‌చేసుకున్న గెస్టుహౌస్‌లో దిగారు. సాయినాథ్ గెస్టుహౌస్‌కు వచ్చేసరికి వాళ్ళ సామాను గది నిండా పరిచి ఉంది. ఆయన మర్యాదగా చెప్పిచూశారు. అక్కడి వారు 'మేం మినిష్టర్ బంధువుల'మని భోజుపోయారు. అంతే సాయినాథ్ ఉగ్రనరసింహు డయ్యారు. వాళ్ల సామాను బయటికి విసిరికొట్టి మీకు చేతనైంది చేసుకోండి పొమ్మన్నారు. పోలీస్ కేసు పెట్టడంతోపాటు కలెక్టర్, సిఎంకు ఫోన్‌చేసి మినిష్టర్ బంధువుల తీరుపై ఫిర్యాదు చేశారు.

లెఫ్ట్ పార్టీల గురించి ప్రస్తావిస్తూ... ఇష్యుబేస్‌డ్‌గా లెఫ్ట్ పార్టీలపట్ల అభిమానం ఉంది. అయితే ఇంత వరకు లెఫ్ట్ పార్టీకి ఓటు వేయలేదంటారు. ముంబాయిలోని బాంద్రా నియోజక వర్గంలో ఓటరు. అక్కడ ప్రతిసారీ కాంగ్రెస్ వర్సెస్ శివసేన ఎన్నికల్లో పోటీ పడుతుంటాయి. సెక్యులర్ ప్రిన్సిపల్‌తో కాంగ్రెస్‌కు ఓటువేయటం జరుగుతోందని చెబుతారు. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో భూ పంపకం జరిగిన కారణంగా అక్కడి అట్టడుగు వర్గాలకు న్యాయం జరిగిందంటారు. లెఫ్టిస్టులకు విజన్ ఉంది కాబట్టే 73వ రాజ్యాంగ సవరణ రాకపూర్వమే పంచాయతీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో రిజర్వేషన్లను అమలుజరిపారని అంటారు. గ్రామీణుల ట్రెండ్ తెలుసుకున్న మహాత్మాగాంధీకూడా లెఫ్ట్! గాంధీ ఇప్పుడు బతికుంటే రాడికల్ లెఫ్టిస్టుగా మారేవాడు. ప్రపంచబ్యాంకు అతన్ని తీవ్రవాదిగా చిత్రీకరించేదని సాయినాథ్ చెబుతారు.

అటువంటి సమయంలో పాత్రికేయులు ఏంచేయాలి. రొమిల్లా థాపర్, అమర్త్యసేన్ రాసిన విషయాన్ని గ్రామీణ ప్రాంతాల వారికి తెలియచెప్పేందుకు ప్రయత్నించాలి. మేధావులకు, సామాన్య ప్రజానీకానికి మధ్య పాత్రికేయులు వారధులుగా పనిచేయాలి. ఇంగ్లీషు పత్రికల్లో పనిచేసే విలేకరులంతా ధనిక వర్గానికి చెందినవారు కావడంతో వారు గ్రామీణాంశంపై దృష్టి సారించట్లేదు. ఇక తెలుగు దినపత్రికల్లో గ్రామీణ విలేకర్లకు అందుతున్న వేతనాలు అతి స్వల్పం. అయినప్పటికీ సత్తా ఉన్న గ్రామీణ విలేకరులున్నారు. ఆకలి చావులను ముందుగా వెలుగులోకి తెచ్చింది వీరే. అయితే వీరు వాస్తవాలను వివరించటంలో కొంత వెనుకపడ్డారు. ఒరిస్సాలోని కలహండిలో బిజోయ్‌సాహి, జగదీష్ సేనా అనే ఇద్దరు ఆదివాసీ యువకులున్నారు. వాళ్ళకు ఎటువంటి శిక్షణ లేదు. అయినప్పటికీ కలహండిలోని దారుణ దుర్భిక్షంపై విస్తృతమైన వార్తా కథనాలు వెలుగులోకి తెచ్చారు. ప్రభుత్వం దిగొచ్చి బాధితులను ఆదుకునే పరిస్థితిని కల్పించారు.

ఇప్పటికైనా మించిపోయిందిలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కరువు, దుర్భిక్షం కేవలం వేసవి కాలానికే పరిమితమైందికాదు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు పడిన తరువాత అక్కడివారు ఎటువంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారో లోతులకు వెళ్ళి పరిశీలించాల్సిన బాధ్యత విలేకర్లపై ఉంది. విలేకరులు అటువంటి ప్రయత్నం చేయాలి.

అభి'రుచులు'... పనితీరు

సాయినాథ్‌కు ఉప్మా అంటే మహా ఇష్టం. హోటల్లో టిఫిన్ చేయాల్సివస్తే ముందుగా అడిగేది 'ఉప్మా' ఉందా అనే. ఉప్మా ఉంటే తృప్తిగా తింటారు. మిగతా ఏ టిఫిన్ అయినా చాలా తక్కువగా తీసుకుంటారు. రొయ్యలు మినహా ఏ కూరయినా అభ్యంతరంలేదు. ఎన్ని రకాల డిష్‌లు ఉన్నా భోజనం తక్కువగానే తింటారు. టూర్‌లో ఉన్నన్ని రోజులూ లైట్ బిస్కెట్ కలర్ కాటన్ జీన్స్, తెల్ల టీషర్టులు వేసుకుంటారు. సందర్భాన్ని బట్టి డ్రస్ వేసుకోవడం ఆయన స్టైల్. ఎక్కువగా లైట్‌బ్లూ, పేల్‌బ్లూ కలర్ షర్టులు ఇష్టపడతారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లిన సందర్భంలో జిబ్బిరి నెత్తి, ముక్కు నుండి చీమిడికారుతూ, చూడ్డానికి అసహ్యంగా ఉండే పిల్లలతో ఉన్న ఇంట్లో నుండి మంచినీళ్ళు తెచ్చినా వాళ్లని ఆప్యాయంగా పలకరించి గ్లాసుడు మంచినీళ్ళు తాగుతారు. ఎవరైనా టీ ఇస్తే కాదనరు. గ్లాసుమీద ఈగలు వాలుతున్నా వాటిని తోలుకుంటూ, మధ్య మధ్య సిప్‌చేస్తూ అక్కడి వారినుండి సమాచారం సేకరిస్తారు. సాయినాథ్ అక్కడి వారిలో ఒకడిగా కలిసిపోయి వాళ్ళకు 'మనవాడు' అన్న భావన కల్పిస్తారు. అందుకే బాధితులుకూడా గుండెలోతుల్లో గూడుకట్టుకున్న బాధను ఆయన ముందు పరుస్తారు.

పుస్తకాల విషయానికి వస్తే... క్లాసిక్స్, బయోగ్రఫీ, హిస్టరీ ఇష్టమైన సబ్జెక్ట్స్. కుల ప్రస్తావన గురించి మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ ఐడియాలజీని అనుసరించాలంటారు. టూర్‌లో ఆయనవెంట నికాన్ కెమేరా, లాప్‌టాప్ కంప్యూటర్‌తోపాటు ఎంపి3 సిడి ప్లేయర్ ఉంటాయి. ప్రయాణంలో తీరిక దొరికితే ఎంపి3 ప్లేయర్ ఆన్‌చేసి సోనీ హెడ్ ఫోన్స్ పెట్టుకొని ఎంజాయ్ చేస్తారు. టైం పంక్చువాలిటీ ఆయన దగ్గర నేర్చుకోవాలి. ఒకరోజు కర్నూలు సిపియం పార్టీ ఆఫీసుకు ఉదయం 11.30 వస్తానని చెప్పారు. కార్ ట్రబులిచ్చింది. మహా అయితే ఐదు నిముషాలు ఆలస్యం అవుతుంది. అయినా దారిలో పార్టీ ఆఫీసుకు ఫోన్‌చేసి ఐదు నిముషాలు ఆలస్యంగా వస్తున్నామని చెప్పారు. చెప్పిన విధంగానే 11.35 లోపే అక్కడికి చేరుకున్నారు.

జీవనమలుపులు

సోనియా గిల్ అనే పంజాబీ వనితను వివాహం చేసుకున్నారు. ఎంతో కాలంగా ఆమె ముంబాయిలోని జన్‌వాది మహిళా సంఘ్(ఐద్వా)లో పనిచేస్తున్నారు. ఆమె ప్రతిరోజూ 15గంటలు మురికివాడల్లోని మహిళల స్థితి మెరుగుపరిచేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుంటారు. సాయినాథ్ ఏడాదిలో 8 నెలలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో తిరుగుతుంటారు. అందువలన పిల్లల్ని కనకూడదని నిర్ణయించుకున్నారు. సాయినాథ్ పూర్వీకులు 1940లో కాకినాడ నుండి చెన్నైకి మకాం మార్చడంతో ఆయన పుట్టి పెరిగింది చెన్నైలోనే. తండ్రి ఆంధ్రా సిమెంట్స్‌లో ప్లాంట్ మేనేజర్‌గా పనిచేశారు. తల్లి హౌస్‌వైఫ్. ఇద్దరు సోదరులు, ఒకసోదరి ఉన్నారు. సాయినాథ్ మద్రాస్ క్రిస్టియన్ స్కూల్లో చదువు ముగిసిన తరువాత లయోలా కళాశాలలో బిఎ హిస్టరీ చేశారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎంఎ చేశారు. అక్కడ ఆయనకు రొమిల్లాథాపర్, సర్వేపల్లి గోపాల్ తదితరులు చరిత్ర బోధించారు. వారి ప్రభావం తనపై పడిందంటారు సాయినాథ్. వాళ్ళ ఉపన్యాసాల ప్రభావం సెక్యులర్ భావాలకు మరింత ఊతం ఇచ్చింది. 1977-79లో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చదివే సమయంలో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో సభ్యులుగా పనిచేశారు. లెఫ్టుపార్టీల సిద్ధాంతాలు నచ్చటమే సభ్యత్వానికి ప్రధానకారణం. అక్కడే ఆయనకు సీనియర్ అయిన సీతారాం ఏచూరితో పరిచయం ఏర్పడింది. ఏచూరి అప్పట్లో అక్కడ యూనివర్సిటీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇప్పటికీ ఆ పరిచయం కొనసాగుతూనే ఉంది. అయినా సాయినాథ్ ఇండిపెండెంట్‌గానే వ్యవహరిస్తున్నారు. 1980లో ఢిల్లీలో ఎంఫిల్ చేస్తుండగా 'యుఎన్ఐ'లో చేరడం జరిగింది. అందువలన యంఫిల్ పూర్తిచేయలేకపోయారు. 1981లో ముంబాయికి బదిలీ అయ్యారు. 1982 నుండి బ్లిడ్జ్ గ్రూప్‌వారి డైలీ టాబ్లాయిడ్‌లో డిప్యూటీ చీఫ్ ఎడిటర్‌గా బాధ్యతలు చేపట్టారు. పదిన్నర సంవత్సరాలు అందులో పనిచేశారు.

దశాబ్దం పనిచేసినా తృప్తిలేక 1993లో ఫ్రీలాన్సర్‌గా మారారు. రూరల్ రిపోర్టింగ్‌మీద దృష్టి సారించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు అదే పంథా కొనసాగిస్తున్నారు. జర్నలిజంమీద ఆసక్తి ఉన్నవారు ఫ్రీలాన్సర్‌గా పనిచెయ్యొచ్చా... అంటే. ఫ్రీలాన్స్ జర్నలిజం చాలా కష్టం. డబ్బుతో కూడుకున్నదంటారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'కు రాసిన ఫీచర్స్ పుస్తక రూపంలో రావడంతో ఆయనకు కొంత ఆర్థిక పరిపుష్టి ఏర్పడింది. అయితే ఆ పుస్తకాలపై వచ్చిన ప్రతిపైసా జర్నలిజానికే ఖర్చు చేస్తున్నారు. ఇదికాక ముంబాయిలోని సోఫియా, చెన్నైలోని ఏషియన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. ఏడాదిలో 8 నెలలు రూరల్ రిపోర్టింగ్‌తోనే కాలం గడుపుతున్నారు. దీంట్లో తృప్తి ఉందంటారు. పలు రాష్ట్రాలకు సంబంధించిన గ్రామీణ సమస్యలను ఇంగ్లీషు పత్రికల్లో ప్రచురించితే ప్రయోజనంలేదు. ఎవరి కోసం వార్త రాశామో వారు చదవాలి. సంబంధిత ప్రాంతీయ భాషలైన తెలుగు, బెంగాలీ, మరాఠీ, ఒరియా, తమిళంలోని దినపత్రికల్లోకి అవి ఫీచర్లుగా అనువదిస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయి అంటారు. ప్రస్తుతం కాంట్రాక్టు బేసిస్‌పై హిందూ దినపత్రికలో ఫీచర్స్ రాస్తున్నారు. సామాజిక అంశాలకు హిందూ పేపర్ అధిక ప్రాధాన్యత ఇస్తుంది. దళిత్ ఇష్యూస్‌పై హిందూకు కమిట్‌మెంట్ ఉంది. ◆

మాజీ రాష్ట్రపతి వివి గిరి సాయినాథ్‌కు తాత అవుతారు. వివి గిరి రిటైర్ అయిన తరువాత చెన్నైలో అందరూ ఒకే ఇంట్లో ఉండేవారు. వివి గిరిని కలవటానికి ట్రేడ్ యూనియన్ నాయకులు, ఫ్రీడమ్ ఫైటర్స్, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అక్కడికి వస్తుండేవారు. నాలుగేళ్ళ వయసులోనే ఆయన రాజాజీని చూడ్డం జరిగింది. జర్నల్స్, కామెంట్స్ వివి గిరి రాసి వాటిని చూడమని సాయినాథ్‌కు ఇచ్చేవారట. అప్పుడు సాయినాథ్ వయసు 12సంవత్సరాలు.

ఎంఆర్‌ఎఫ్‌లో చీఫ్ ఆడిటర్‌గా పనిచేసిన పాలగుమ్మి మోహనరావు (సాయినాథ్ బాబాయి) సాయినాథ్ క్లిప్పింగ్స్ సేకరించి ఫైలింగ్‌చేస్తారు. ఆంధ్ర పత్రికల్లోనే కాదు, అన్ని భాషల్లో ప్రచురితమైన సాయినాథ్ రచనలను సేకరించడం ఆయన హాబీ. ఆయనకూడా చెన్నైలోనే ఉంటారు. అప్పుడప్పుడు సాయినాథ్ అక్కడకు వెళ్ళి ఫైలింగ్‌లోని తన ఫీచర్స్ చదివి 'ఇవి నేనే రాశానా'... అని ఆశ్చర్యపోతుంటారట!

కాలికి బలపం..

సంగీతాన్ని వినిపిస్తూ మోగిన తన సెల్ ఫోన్‌ను కీ నొక్కి చెవికానించుకున్నాడు శ్రీ మహావిష్ణువు.

"నేను సార్ బ్రహ్మను.. ఒక విషయం మాట్లాడాలి రమ్మంటారా?"

"వచ్చేయండి"

క్షణంలో ప్రత్యక్షమయ్యాడు బ్రహ్మ. ఆయన వైపు చూసి ఆశ్చర్యపోయాడు శ్రీ మహావిష్ణువు.

"ఏంటి మీ తలకాయల్లో రెండు వాలిపోయాయి."

"ఒకటి తల నొప్పితో వాలిపోయింది. రెండోది సిగ్గుతో వాలిపోయింది"

"సిగ్గుతోనా !" ఆశ్చర్యపోతూ, "సరే ఏంటి విషయం?" అన్నాడు.

"ఏం చెప్పేది? మానవులు నేను వాళ్ల నుదుటిన రాసిన రాతను తమకు తామే మార్చేసుకుని వ్యవహరిస్తున్నారు. రాతా గీతా జాంతానై.. నో కర్మ సిద్ధాంతం అంటున్నారు. శ్రమయేవ జయతే అనుకుంటూ ఫలితాలు సాధిస్తున్నారు.. ఇంకా నా విలువేం ఉంటుంది?" ఆవేశంగా ప్రశ్నించాడు బ్రహ్మ.

విష్ణుమూర్తి సాలోచనగా చూశాడు.

కొద్దిసేపు ఆలోచించి "కాలాన్నిబట్టి మారాలి. మార్పు అనివార్యం.. కాబట్టి మీరొక పని చేయండి" అని చెప్పాడు.

ఏంటన్నట్లు చూశాడు బ్రహ్మ.

"మానవులు ఏం చేస్తే అది 'బ్రహ్మ రాసిందే'నని ప్రచారం చేయండి. అప్పుడు మీరు రాసిందిగాక.., వారు చేసిందే మీ రాతగా ప్రచారమై మీ విలువ తగ్గకుండా ఉంటుంది" అన్నాడు

"బాగుంది కానీ.. ఈ విషయం తెలిసి అందరూ నవ్వుకోరూ.." భయంగా అడిగాడు బ్రహ్మ.

"తెలిస్తే గదా! నవ్వుకోడానికి.. ఈ విషయం మన మధ్యనే ఉండాలి.. మూడో కంటివాడికి తెలియకూడదు" అన్నాడు గుసగుసగా.

అప్పుడే గుమ్మంలోకి అడుగుపెట్టబోయిన శివుడు..

"మూడో కంటివాడు అంటే నేనే కదా! నా వెనుకేవో మంతనాలు చేస్తున్నారు" అనుకుని కోపంతో గిర్రున వెనక్కు తిరిగిపోయాడు.

శివుడు అపార్థం చేసుకున్నాడని, అకారణంగా కోపం వచ్చిందని విష్ణు, బ్రహ్మలు గ్రహించి అసలు విషయం వివరించి అలక మాన్పారు.

* * *

'మూడో కంటికి తెలియకూడదు..'

'మూడో కంటివాడికి తెలియకూడదు'.. అనే రెండు ప్రయోగాలూ తెలుగు పలుకుబడుల్లో ఉన్నాయి. దీనర్థం 'మనిద్దరికే తప్ప మరొకరికి తెలీకూడదనే'. ఇక్కడ 'కన్ను'ను చూపుగా అర్థం చేసుకోవాలి. ఒక మనిషికి ఒక చూపు కాబట్టి, 'మనిద్దరి చూపులో తప్ప మూడోవాడి చూపులో(కంట్లో) పడకూడదు' అనేది దీని భావం. అంతేతప్ప మూడు కళ్లున్న శివుడిలాగా వేరే అర్థం తీసుకోకూడదు సుమా..!

ఇలా అర్థ విపరిమాణానికి దారితీసే అవకాశమున్న పలుకుబడులు మనకు ఇంకొన్ని కూడా ఉన్నాయి.

'కాలికి బలపం కట్టుకోవడం..' అలాంటిదే.

'మీ వాడి బుద్ధి తెలిశాక.. కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఏ అమ్మాయీ దొరకదు" లాంటి ప్రయోగాలను వింటూనే ఉంటాం. ఈ జాతీయం అర్థం చాలామందికి తెలియదు. తెలిసినా.. తెలీకపోయినా అందరూ వాడతారు. వాడటం కూడా సరిగ్గానే వాడతారు.

బలపానికి.. తిరగడానికి సంబంధమేమిటనే ప్రశ్న వస్తుంది. దీని భావమేమిటంటే..

కాలికి బలపం కట్టుకుని నడిస్తే ఏమవుతుంది? మనం ఎటు నడిస్తే అటు కింద గీత పడుతుంది. అంటే మార్కింగ్ పడుతుంది. కాలికి బలపం కట్టుకుని మార్కింగ్ పెట్టుకుంటూ తిరగడమన్నమాట. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే గుర్తుగా మార్కింగ్ పెట్టుకుంటూ 'తిరిగిన చోటుకు తిరగకుండా.. అన్ని ప్రాంతాలూ తిరగడ..'మని అర్థం. అర్థమైంది కదా!

'చిలకాగోరింకల్లా జీవించండి' అని దీవిస్తుంటారు. 'చిలకాగోరింకల్లా కాపురం చేసుకుంటున్నారు' అని అంటూంటారు.

ఈ పలుకుబడి మీద సంశయం ఉంది కొందరికి. చిలకలు, గోరింకలు జత కడతాయని కూడా అనుకుంటారు. అలా అనుకోవడం వల్లే 'ఒక చిలకమ్మ, ఒక గోరింకా మనువాడుకున్నాయి' లాంటి కథాంశాలు సాహిత్యంలోకి వచ్చాయి. పాటల్లో వినే ఉంటారు.'తాళి కట్టు శుభ వేళ మెడలో కల్యాణ మాల..' అనే పాపులర్ పాత సినిమా పాటలో ఇలాగే ఉంటుంది కదా!. కానీ చిలకలు, గోరింకలు దగ్గరవవు. ఏ జాతికా జాతే దగ్గరవుతాయి. ఈ పక్షి జంటలు అన్యోన్యంగా ఉంటాయి కాబట్టి.. రెండు జాతులనూ ఒకేసారి పోలికకు తేవడం వల్ల ఈ అపార్థానికి ఆస్కారమేర్పడింది.

'చిలకల్లా.. గోరింకల్లా..' అనే భావ స్పష్టత కొరవడి 'చిలకాగోరింకల్లా' అర్థ విపరిణామం జరిగింది. పోలిక తీరు.., వాడుక సందర్భం మాత్రం సరిగ్గానే ఉండడం విశేషం. ◆

పాఠక స్పందన

ఆకట్టుకున్న 'బేరం'

జూన్ 22, 2003 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన జీవనశైలి 'బేరం' అనే శీర్షిక నన్ను ఆకట్టుకుంది. మధ్యతరగతికి చెందిన కుటుంబాలలోని మహిళల వాస్తవిక పరిస్థితులకు అద్దం పడుతుంది. రెక్కలు, ముక్కలు చేసుకొని, ఇంటింటికీ తిరుగుతూ, కష్టపడి జీవనం సాగిస్తున్న వాళ్లలో బేరసారాలు సాగిస్తారు మన మహిళలు! బహుళ జాతి కంపెనీలు తమ వస్తువుల అమ్మకాల కోసం ట్రిక్స్ చేస్తూ, మనవాళ్లను మోసాలు చేస్తూ, వేల కోట్ల రూపాయలు దండుకుంటున్నాయి. మరిన్ని మహిళలకు చెందిన విషయాలను ప్రచురించగలరని ఆశిస్తున్నాను.

- ఎస్. సైలజ, యల్లమంద, ఖమ్మం

గురువంటే అలా ఉండాలి

జూన్ 22, 2003 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'గురు బ్రహ్మ' రియల్ స్టోరీ చాలాబాగుంది. ఉపాధ్యాయుడుండీ కేవలం స్కూలు వరకే పరిమితం కావాలని, ఎవరితో మాట్లాడితే ఏమొస్తుందోనని, తన బాధ్యత పాఠాలకే పరిమితమని సమాజం, ఆర్థిక పరిస్థితులు, దేశంలో వస్తున్న మార్పులు చూడడానికి మానసికంగా సిద్ధం కాని అనేక మంది ఉపాధ్యాయుల్ని ఈ రోజు చూస్తున్న పరిస్థితుల్లో ఇటువంటి వ్యాసం రావడం ముదావహం. అలాగే ఎమ్. హెచ్‌గారి జీవితం వారి నిరాడంబరత, వామపక్ష ఉద్యమంలో వచ్చిన ఆటుపోటుల్లో వారి వ్యాసాలు చదివి అభివృద్ధి చెందిన వాళ్లలో నేనొకణ్ణి కనుక వారి మధుర స్మృతుల్ని మరోసారి గుర్తు చేసినందుకు కృతజ్ఞతలు. అలాగే కొండబాబు గారు ప్రతివారం అనేక విషయాలపై రాస్తున్నారు. ఇటువంటి వ్యాసాలు మరికొన్ని కూడా ప్రచురించగలరు.

- బి.కోటేశ్వరరావు, నార్నెపాడు, గుంటూరు జిల్లా

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

మీ పిల్లల చదువు, క్రమ-శిక్షణ, ఆరోగ్యము మరియు ఉజ్వల భవిష్యత్తును గురించి విచారించకండి!

మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు
మేనేజింగ్ డైరెక్టర్

మాదల ప్రమీల రాణి
డైరెక్టర్

డా॥ మాదల సూర్యశేఖర్, M.B.B.S.
డైరెక్టర్-అకడమిక్

- ☛ 181 మంది విద్యార్థులు మాథ్స్‌లో 90-100 మార్కులు సాధించారు.
- ☛ 94 మంది విద్యార్థులు సైన్స్‌లో 90-100 మార్కులు సాధించారు.
- ☛ 500 లకు పైగా మార్కులు సాధించినవారు 112 మంది విద్యార్థులు.

S.S.C. 2003 లో 550 కి పైగా మార్కులు సాధించి రూ. 25,000/- చొప్పున నగదు బహుమతులు పొందిన మా విద్యార్థులు

Marks 558
E. Anusha Reddy
H.No. 0234821

Marks 557
Y. Satish
H.No. 234430

Marks 556
P. Vakula
H.No. 0235012

Marks 553
N.D.Y. Sampath
H.No. 234958

Marks 550
Y. Ahalya
H.No. 234833

7వ తరగతి కామన్ ఎగ్జామ్స్‌లో 550/600 లకు పైగా మార్కులు తెచ్చుకుని, ప్రస్తుతం 8 లేదా 9 లేదా 10వ తరగతులు చదవబోతూ, శ్రీ విశ్వశాంతిలో చేరగోరు విద్యార్థులకు పై మూడు తరగతులకు ప్రతి సంవత్సరం శ్రీ విశ్వశాంతి రూ. 30,000/- మెరిట్ స్కాలర్‌షిప్ ఇవ్వబడుతుంది.

సాధారణ విద్యార్థులతో కూడా అసాధారణ ఫలితాలు సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ

- ప్రశాంతమైన గ్రామీణ వాతావరణంలో గత 28 సంవత్సరముల నుండి అంకితభావంతో ఎక్కడా బ్రాంచీలు లేకుండా స్వీయ పర్యవేక్షణలో నిర్విరామంగా కృషిచేస్తున్న ఏకైక విద్యాసంస్థ.
- శాస్త్రీయసంగీతం, వాద్యసంగీతం, వీణ, కూచిపూడి, భరతనాట్యం, మోడరన్ & వెస్ట్రన్‌డ్యాన్స్, కుంగ్‌ఫూ, కరాటే మరియు యోగా మొదలగువాటిలో శిక్షణ.
- సొంత డెయిరీ ఫామ్ కలిగి, హాస్టల్ విద్యార్థులకు పుష్టికరమైన ఆహారం.
- విశాలమైన క్రీడా ప్రాంగణంతో క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్న విద్యాసంస్థ.
- పబ్లిక్ పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు రు. 25,000/-ల నుండి రు. 1,50,000/-ల వరకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక నగదు బహుమతులు ఇస్తున్న విద్యాసంస్థ.
- 80 ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో, సువిశాల భవనాలతో స్థాపించబడినది.
- 6,7,8,9,10వ తరగతుల బాలబాలికలకు వేరు వేరుగా ప్రతి క్లాసులో టాలెంట్ సెక్షన్‌లు కలవు.
- 8,9,10వ తరగతుల నుండి టాలెంటెడ్ సెక్షన్‌లకు ఐఐటి ఫౌండేషన్ కోర్సు కలదు.
- ఐ.సి.యస్.ఇ. & సి.బి.యస్.ఇ. సిలబస్ చదివిన విద్యార్థినీ, విద్యార్థులకు కూడా అడ్మిషన్లు కలవు.
- బాల, బాలికలకు వేరువేరుగా హాస్టలు వసతి కలదు.

• L.K.G. నుండి 10వ తరగతి వరకు • స్టేట్ సిలబస్ • కో-ఎడ్యుకేషన్

Maths & Science 199/200 State 2 nd Place
Y. Ahalya
H.No. 234833

Maths & Science 198/200 State 3 rd Place
K.S.M. Manikanth
H.No. 0234467

శ్రీ విశ్వశాంతి గోల్డ్‌మెడల్ విజేతలు S.S.C. 2003 లో మాథ్స్ మరియు సైన్స్‌లో (199/200, 198/200) మార్కులు సాధించి స్టేట్ సెకండ్, థర్డ్ గా నిలిచిన మా విద్యార్థులు.

S.S.C 2003 లో ఉత్తీర్ణత 99%

S.S.C. 2003 లో పరీక్షలకు	
హాజరైన విద్యార్థుల సంఖ్య	352
ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య	347
ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	325
ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	20
తృతీయశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	2

ఇప్పటివరకు పరీక్షలకు హాజరైన	
మొత్తం విద్యార్థుల సంఖ్య	3,194
ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య	3,102
ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన సంఖ్య	2,573
ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులైన సంఖ్య	441
తృతీయశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	88

ఈ అద్భుత విజయాలు సాధించిన మా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు అధ్యాపక వర్గానికి మా హృదయపూర్వక శుభాభినందనలు...

శ్రీ విశ్వశాంతి - ఉయ్యూరు

Estd : 1975

ఇంగ్లీషు మీడియం స్కూల్ (Recognised by Govt. of A.P.)

ఉయ్యూరు - 521 165. విజయవాడ దగ్గర, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్స్: 08676-232962, 233292, 232964, 232818. సెల్: 98480 44059, 9440157895